/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
గురువారం
12-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 253
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

భాద్రపద మాసం, గురువారం, తిథి : త్రయోదశి సా.07.54 వరకు, నక్షత్రం: పుబ్బ, ఉ:11.36 వరకు, వర్జ్యం: సా.07.34-09.21 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.05-10.52 వరకు, రాహుకాలం: మ.01.30-02.58 వరకు

## ప్రపంచ ఆర్థికాభివృద్ధి కేంద్రంగా భారత్



సుసంపన్నమైన భారత్‌ను సాధించే దిశగా మన ప్రయాణాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుదాం..

మన సంస్కరణలను మరింత పెంచుదాం

ప్రధాని మోదీ

2

# బీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుంది



## మెనిఫెస్టోలతో కేసీఆర్ రెండు సార్లు మోసం చేశారు..?

### బీఆర్ఎస్ మూడో మెనిఫెస్టోను ప్రజలు విశ్వసించరు..

మెనిఫెస్టోను మతగ్రంథాలతో పోల్చిన కేసీఆర్ హామీలను చెత్తబుట్టలో వేశారు

బీఆర్ఎస్‌కు దమ్ముంటే.. అమరవీరుల స్థూపం వద్ద మెనిఫెస్టోపై చర్చించాలి

బీజేపీ ధాటికి తట్టుకోలేక టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారింది

ప్రజల ఆశీస్సులతో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కేసీఆర్ కొడుకు అహంకారంతో విర్రవీగుతున్నాడు, ఆయన ముఖం చూసి ఓట్లెవరేస్తారు.. రాష్ట్రం మొత్తం దేవుడెరుగు... సిరిసిల్లలోనే కేసీఆర్ కొడుకుకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు..

- బండి సంజయ్

వివరాలు.. 2లో

## రాజస్థాన్ ఎన్నికల తేదీ మార్పు..




నవంబర్ 23 బదులు.. నవంబర్ 25న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 :** రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్లో కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా మార్పులు చేసింది. రాజస్థాన్ అసెంబ్లీకి ముందుగా ప్రకటించిన నవంబర్ 23 బదులు.. నవంబర్ 25న ఎన్నికలు నిర్వహించనున్నట్లు బుధవారం వెల్లడించింది. ఎన్నికల ఫలితాలను మిగతా నాలుగు రాష్ట్రాలతోపాటు డిసెంబర్ 3న వెల్లడించనున్నట్లు ..మిగతా 2లో

## ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడి..



గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

1500కి పైగా మృతి, వేలల్లో క్షతగాత్రులు

అంధకారంలో గాజా పరిసర ప్రాంతాలు

హమాస్‌తో పాటు మరో రెండు దేశాలతో ఐడీఎఫ్ పోరాటం

**జెరూసలేం, అక్టోబర్ 11:** ఇజ్రాయిల్‌పై హమాస్ ఉగ్రవాదుల దాడి మిడిల్ ఈస్ట్‌లో మరోసారి టెన్షన్ వాతావరణం తీసుకువచ్చింది. హమాస్ దాడుల వల్ల ఇప్పటి వరకు 1200 మందికి పైగా ఇజ్రాయిలీ పౌరులు మరణించగా.. పలువురు బందీలుగా చేసుకుని గాజాకు తీసుకెళ్లింది హమాస్. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్ తీవ్ర ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. హమాస్‌ని పూర్తిగా నాశనం చేసేదాకా విశ్రమించేది లేదని తేల్చి చెప్పింది. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ వైమానికి దాడులను చేస్తోంది. మరోవైపు ఈ దాడుల్లో గాజాలో కూడా 1500కి పైగా మంది మరణించారు. ఈ యుద్ధం కారణంగా ఇప్పటి వరకు మరణాల సంఖ్య 3000 వేలకు చేరింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం గాజాలో ఉన్న ఏకైక విద్యుత్ కేంద్ర కూడా పనిచేయడం లేదని నివేదికలు తెలిపాయి. దీంతో గాజాలో అంధకారం అలుముకుంది. ఇప్పటికే ఆ ప్రాంతానికి నీరు, ఆహారం, ..మిగతా 2లో

## చైనా రుణ ఉచ్చుతో జాగ్రత్త..



జైశంకర్ హెచ్చరిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 :** హిందూ మహాసముద్రం ప్రాంతంలోని అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాలని బుధవారం ఇండియా పిలుపునిచ్చింది. శ్రీలంక రాజధాని కొలంబోలో జరుగుతున్న ఇండియన్ ఓషియన్ రిమ్ అసోసియేషన్ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. యూఎన్ కన్వెన్షన్ ఆధారంగా హిందూ మహాసముద్రం స్వేచ్ఛా, ..మిగతా 2లో

## రైతుల అభ్యున్నతిపై కేంద్రం ప్రత్యేక దృష్టి

సహకార రంగాల సేవల్లో ముందంజలో దక్షిణ భారతదేశం

గవర్నర్ తమిళిసై సౌదరరాజన్



**హైదరాబాద్, అక్టోబర్ 11 (మనం న్యూస్):** దేశంలో సహకార రంగం బలోపేతం, రైతుల అభ్యున్నతిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీలో అఖిల భారత సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల సహకార సదస్సుకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ ఛైర్మన్ టిఎస్ మార్క్‌ఫెడ్, గంగారెడ్డి, జాతీయ సహకార సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సుధీర్ మహాజన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెద్ ప్రకాష్ సేథియా, ఇతర ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల సహకార ఉద్యమకారులు, నిపుణులు పాల్గొన్నారు. పలు దేశాల్లో ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో సహకార రంగంలో సవాళ్లు, విజయాలు నమోదు చేసుకుంటున్న సహకార సంఘాల విజయగాథలను గవర్నర్ తమిళిసై గుర్తుచేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానపరమైన నిర్ణయాలు, ..మిగతా 2లో



## 14న సీఈసీ భేటీ..

తర్వాత అభ్యర్థుల జాబితా

అంతకంటే ముందు భేటీ కానున్నకాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ

దసరా తరువాత మలి జాబితా

వివరాలు.. 2లో

## ఊదరగొట్టే ఉపన్యాసాలు కాంగ్రెస్‌కు అలవాటే

హామీలు ఇవ్వడం మరచిపోవడం పరిపాటే

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 11 (మనం న్యూస్):** ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. హామీలు ఇవ్వడం అమలు చేయకపోవడం కూడా ఆ పార్టీకి అలవాటేనన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన బిల్యా నాయక్, ఆయన అనుచరులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణ భవన్‌లో ..మిగతా 2లో

## యువత కోసం మేరా యువ భారత్..



కేంద్ర కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 :** యువత నైపుణ్యాభివృద్ధి, వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించ డమే లక్ష్యంగా కొత్త కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మేరా యువ భారత్ (మై భారత్) పేరిట ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వేదిక ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ ..మిగతా 2లో

## గెలిచేది పక్కా గులాబీ జెండా



కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు..

కరెంటు కటకటలే.. కరువులు కర్ఫ్యూలే..

156 మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటిస్తారు

16న జనగామ బహిరంగ సభకు హాజరవుతారు

బీఆర్ఎస్‌లో బేధాభిప్రాయాలు లేవు: మంత్రి హరీశ్‌రావు

**జనగామ, అక్టోబర్ 11 (మనం న్యూస్):** కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు.. కరెంటు కటకటలు.. కరువులు కర్ఫ్యూలేనని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి స్వాగత సభ, 16న సీఎం కేసీఆర్ బహిరంగ సభ విజయవంతం కోసం నియోజకవర్గ స్థాయి సన్నాహక సదస్సులో మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు జనగామ అంటే ప్రేమ ..మిగతా 2లో

## సింగరేణి ఎన్నికలు వాయిదా..

ఎన్నికల నిర్వహణపై గడువు పొడగిస్తు హైకోర్టు ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్, అక్టోబర్ 11 (మనం న్యూస్):** సింగరేణి ఎన్నికలు హైకోర్టు వాయిదా వేసింది. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు వాయిదా వేస్తూ హైకోర్టు సంచలన ..మిగతా 2లో

## సంస్కారం లేకుండా విమర్శలా



ఫ్రస్ట్రేషన్‌లో స్థాయిని మించి మాట్లాడుతున్నాడు

కేటీఆర్ తీరుపై మండిపడ్డ లక్ష్మణ్

**హైదరాబాద్, అక్టోబర్ 11 (మనం న్యూస్):** కేటీఆర్ సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సీఎం ..మిగతా 2లో

## వచ్చేది ప్రజా ప్రభుత్వం



తెలంగాణ తెచ్చుకుంది దోపిడీదారుల కోసం కాదు

ఆరు గ్యారంటీ కార్డులతో ప్రజల్లోకి...

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు

త్వరలోనే అభ్యర్థుల ప్రకటన

సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క

వివరాలు.. 9లో

### మంచిమాట

జీవితం చాలా కఠినమైన పరీక్ష. కానీ చాలామంది దానిలో విఫలం చెందటానికి కారణం. ప్రతీ ఒక్కరి ప్రశ్నాపత్రం వేరనేది గ్రహించకపోవటమే.

శుభోదయం

## ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడి..

(మొదటిపేజీ తరువాయి)

ఇంధనం ఇలా ప్రతీ అవసరాన్ని ఇజ్రాయిల్ సైన్యం కట్ చేసింది. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ మాట్లాడుతూ.. 'విద్యుత్ ఉండదు, ఆహారం లేదు, ఇంధనం ఉండదు, ప్రతిదీ కట్ చేస్తామని' హెచ్చరించారు. అక్టోబర్ 7 హమాస్ దాడుల తర్వాత ఇజ్రాయిల్ గాజాలోని పలు ప్రాంతాలకు పూర్తిగా విద్యుత్‌ని నిలిపేసింది. తాజాగా పాలస్తీనా ఎన్‌క్లేవ్‌లోని ఏకైక పవర్ స్టేషన్ పనిచేయడం ఆగిపోయింది. ఇప్పటికే గాజాలోని హమాస్ ఉగ్రవాదులతో సంబంధం ఉన్న ఇస్లామిక్ యూనివర్సిటీని ఇజ్రాయిల్ వైమానికదళం ధ్వంసం చేసింది. హమాస్ ఉగ్రవాదులు ఉంటున్న ప్రతీ ఇంటిని పేల్చేస్తోంది. హమాస్ మిలిటరీ వింగ్ చీఫ్ మహ్మద్ డయిఫ్ ఇంటిని కూడా టార్గెట్ చేసింది ఇజ్రాయిల్. ఈ దాడిలో డయిఫ్ కుటుంబానికి చెందిన పలువురు మరణించినట్లు హమాస్ ధ్రువీకరించింది. మరోవైపు హమాస్‌కి మద్దతుగా లెబనాన్ నుంచి హిజ్బుల్లా మిలిటెంట్లు, సిరియా నుంచి కూడా దాడులు జరుగుతున్నాయి. దీంతో ఇజ్రాయిల్ మూడు వైపుల నుంచి దాడులను ఎదుర్కొంటోంది. ఇజ్రాయిల్‌పై హమాస్ తీవ్రవాదులు శనివారం భీకరదాడులకు పాల్పడ్డారు. ఈ దాడులకు ప్రతీకారంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) విరుచుకుపడుతోంది.గాజాలోని ప్రముఖ భవనాలను బాంబులతో కుప్పకూలుస్తోంది. ఈ దాడులకు ప్రధాన సూత్రధారి, హమాస్ మిలిటరీ వింగ్ చీఫ్ మహ్మద్ డయిఫ్ ఇంటిని టార్గెట్ చేసింది ఇజ్రాయిల్. ఈ దాడిలో డయిఫ్ కుటుంబ సభ్యులు మరణించినట్లుగా హమాస్ ధ్రువీకరించింది. ఇప్పటి వరకు ఇరు వైపుల మరణాల సంఖ్య 3000ను దాటింది. ఇదిలా ఉంటే ఇజ్రాయిల్ మూడు వైపుల నుంచి ముప్పును ఎదుర్కొంటోంది. గాజా నుంచి ఇప్పటికే హమాస్ తీవ్రవాదులపై ఇజ్రాయిల్ పోరాడుతుంటే, ఉత్తరం నుంచి లెబనాన్, తూర్పు నుంచి సిరియా నుంచి పలు మిలిటెంట్ సంస్థలు హమాస్‌కి మద్దతుగా పోరాటం కొనసాగిస్తున్నాయి. దీంతో ముప్పేల ముప్పుపై ఐడీఎఫ్ బలగాలు పోరాడుతున్నాయి. సిరియా వైపు నుంచి గోలన్ హైట్స్‌పైకి సిరియా దాడులు చేసింది. బుధవారం ఈ దాడుల్ని తిప్పికొట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం చెప్పింది. 1967లో ఇజ్రాయిల్ ఈ గోలన్ హైట్స్ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. మరోవైపు లెబనాన్ నుంచి హమాస్ మద్దతుదారులైన హిజ్బుల్లా మిలిటెంట్లు దాడులు చేస్తున్నారు. హమాస్ దాడులు మొదలైన తర్వాత తొలిరోజే హిజ్బుల్లా ఇజ్రాయిల్ పై దాడులు చేస్తోంది. తాజాగా లెబనాన్ నుంచి ఇజ్రాయిల్ పోస్టులపై ద్రాడలు జరిగాయి. మిలిటెంట్ గ్రూప్ యాంటీ ట్యాంక్ క్షిపణిని పేల్చేసింది. ఇలా మూడు వైపుల నుంచి ఇజ్రాయిల్ పోరాడుతోంది.

## రాజస్థాన్ ఎన్నికల తేదీ మార్పు..

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. అయితే నవంబర్ 23న రాష్ట్రంలో పెద్ద ఎత్తున వివాహాలు, ఇతర కార్యక్రమాలు ఉన్నట్లు ఈసీ తెలిపింది. ఈ క్రమంలో భారీ సంఖ్యలో ప్రజలకు అసౌకర్యం కలిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అదే విధంగా రవాణా విషయంలోనూ సమస్యలు తలెత్తి పోల్ సమయంలో ఓటర్ల సంఖ్య తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికల తేదీలను వాయిదా వేసినట్లు ఈసీ పేర్కొంది. వివిధ రాజకీయ నాయకులు, సామాజిక సంస్థలు, చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కాగా తెలంగాణ, మిజోరాం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ను సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించిన విషయం తెలిసిందే. అయిదు రాష్ట్రాలకు ఎన్నికల తేదీలను, ఓట్ల లెక్కింపు తేదీలను ప్రకటించింది. దీని ప్రకారం తెలంగాణలో నవంబర్ 30న, రాజస్థాన్లో నవంబర్ 25న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఛత్తీస్గఢ్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 7న తొలి విడత, నవంబర్ 17న రెండో విడతలో పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్లో నవంబర్ 17న పోలింగ్ జరగగా.. మిజోరాంలో నవంబర్ 7న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాలకు డిసెంబర్ 3న కౌంటింగ్ జరగనుంది.

## చైనా రుణ ఉచ్చుతో జాగ్రత్త..

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ, సమ్మిళిత ప్రదేశంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో చైనాను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆచరణ సాధ్యం కాని ప్రాజెక్టులు, భరించలేని రుణాలతో 'హిడెన్ ఎజెండా' ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని పరోక్షంగా చైనాను ఉద్దేశించి అన్నారు. చైనా రుణ ఉచ్చు గురించి పరోక్షంగా సభ్యదేశాలకు తెలియజేశారు. చైనా, శ్రీలంకకు భారీగా రుణాలు ఇచ్చి, అవి చెల్లించకపోవడంతో హంబన్ టోటా ఓడరేవును 2017లో ఈక్విటీ కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకుంది. 1.2 బిలియన్ రుణం ఇచ్చి ఏకంగా శ్రీలంక హంబన్ టోటా నౌకాశ్రయాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. ఇదే కాకుండా చైనా తన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ) ద్వారా పలు పేద, వెనకబడిన దేశాలకు అభివృద్ధి పేరుతో రుణాలు అందిస్తూ, వాటిని నెమ్మదిగా రుణ ఊబిలోకి దించుతోంది. మరోవైపు హిందూ మహాసముద్రంలో భారత్ ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకు చైనా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే శ్రీలంకలో పాగా వేయగా.. ఇటీవల మాల్దీవుల్లో చైనా అనుకూల అధ్యక్షుడు గెలుపొందడంతో ఆ దేశంలో కూడా పాగా వేయాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలోనే భారత్, హిందూ మహాసముద్ర దేశాలను హెచ్చరించారు. బంగ్లాదేశ్, మారిషస్, మలేషియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల విదేశాంగ మంత్రులు సమావేశానికి 16 మంది మంత్రులు హాజరయ్యారు.

## ప్రపంచ ఆర్థికాభివృద్ధి కేంద్రంగా భారత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 11 : దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో భారత్ మెరుగైన స్థానానికి చేరుకుంటోందని ప్రధాని మోదీ అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ 'వరల్డ్ ఎకనామిక్ అవుట్లుక్' పేరుతో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ దేశాల వృద్ధి రేటు అంచనాలను విడుదల చేసింది. ఇందులో భారత్ వృద్ధి రేటు అంచనా 6.3 శాతంగా ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ అంచనాలను ఉద్దేశించి ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 'దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధికి, ఆవిష్కరణలకు భారత్ కేంద్రంగా నిలుస్తోంది. సుసంపన్నమైన భారత్‌ను సాధించే దిశగా మన ప్రయాణాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుదాం. మన సంస్కరణలను మరింత పెంచుదాం' అని ప్రధాని ట్వీట్లో పేర్కొన్నారు. ఇటీవల భారత్ వృద్ధి రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.5 శాతంగా పేర్కొంది. దానికి 0.2 శాతం తగ్గించి 6.3గా ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత జులైలో భారత్ వృద్ధి రేటును 6.1 శాతంగా ఐఎంఎఫ్ పేర్కొనడం గమనార్హం. ఈసారి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా వృద్ధి రేటు భారత్ కంటే తక్కువగా ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆ దేశంలో నెలకొన్న స్థిరాస్తి విపణి సంక్షోభం కారణంగా వృద్ధి రేటు అంచనాలను తగ్గించినట్లు ఐఎంఎఫ్ పేర్కొంది.

# బీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుంది

కరీంనగర్, అక్టోబర్ 11 (మనం బ్యూరో) : 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇదివరకే రెండు సార్లు ప్రకటించిన మెనిఫెస్టోతోనే ప్రజల మైండ్ బ్లాంక్ అయ్యింది.. మరోసారి మెనిఫెస్టోతో ప్రజలను మోసం చేసేందుకు రెడీ అవుతున్నారు.. ఎన్నికల మేనిఫెస్టో బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానమంటూ ప్రగల్భాలు పలికిన కేసీఆర్ మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయకుండా చెత్తబుట్టకే పరిమితం చేశారు.. ఈసారి ప్రజలే బీఆర్ఎస్ పార్టీ నేతల మైండ్ బ్లాంక్ అయ్యే తీర్పు ఇవ్వబోతున్నారు.. కేసీఆర్ సహా బీఆర్ఎస్ నేతలకు సిగ్గుంటే.. మేనిఫెస్టో హామీలెందుకు అమలు చేయలేదో అమర వీరుల స్థూపం వద్దకు వచ్చి చర్చించేందుకు సిద్ధం కావాలి..' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో మళ్లీ ఎలాగైనా గెలవాలని కుట్ర చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు తొత్తులుగా పనిచేసే వాళ్లకే పోస్టింగులిచ్చుకున్నారని చెప్పారు. అన్ని శాఖల అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం ఇంటెలిజెన్స్ అధికారులను ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వారంటీ లేని కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గ్యారంటీలను నమ్మేదెవరని ప్రశ్నించారు. ఎంగిలి మెతుకులకు ఆశపడే నీచమైన పార్టీ ఎంఐఎం అని, ఆ పార్టీకి చీమునెత్తురుంటే తెలంగాణ అంతటా పోటీ చేయాలని సంజయ్ సవాల్ విసిరారు. కరీంనగర్‌తోపాటు తెలంగాణ అంతటా బీఆర్ఎస్ నేతల అవినీతి అరాచకాలు, భూకబ్జాలను భరించలేక ప్రజలు అల్లాడుతున్నారని ఆరోపించారు. భరోసా ఇచ్చే పార్టీ కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వారికి బీజేపీ దిక్సూచిలా కన్పిస్తోందని, ప్రజల ఆశీస్సులతో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని, కరీంనగర్‌లోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు వారం రోజుల్లోగా పరిహారం ఇస్తానని ప్రకటించిన కేసీఆర్ ఇప్పటి వరకు ఎంత మందికి డబ్బులిచ్చారో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు ఎన్ని నిధులిస్తుందో? కేంద్రం ఎన్ని నిధులిస్తోందో చర్చకు సిద్ధమా? రోజ్ గార్ మేళా పేరిట ఇప్పటి వరకు కేంద్రం నాలుగు లక్షల ఉద్యోగాలిచ్చిందని, మరి బీఆర్ఎస్ ఎన్ని ఉద్యోగాలిచ్చిందో చెప్పాలన్నారు. రైతు బంధు పేరుతో అన్ని సబ్సిడీలను బంద్ చేసిన మూర్ఖుడు కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుందని, బీజేపీ ధాటికి తట్టుకోలేక టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని కొందరు అధికారులు బీఆర్ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలను, సామాన్య ప్రజలను వేధిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా నిజాయితీగా వ్యవహరిస్తూ ఎన్నికలు జరపాలని, బీఆర్ఎస్ తొత్తులుగా ఉన్న అధికారులను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కొడుకు అహంకారంతో విర్రవీగుతున్నాడని, ఆయన ముఖం చూసి ఓట్లెవరేస్తారని, రాష్ట్రం మొత్తం దేవుడెరుగు.. సిరిసిల్లలోనే కేసీఆర్ కొడుకుకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. రజాకార్ సినిమా తీస్తే బీఆర్ఎస్‌కెందుకు భయమని, రజకార్ ఏమైనా గొప్పోడా? నిజాం ఏమైనా గొప్పోడా? నిజాంకు వ్యతిరేకంగా మాట్లాడితే ఇబ్బందేమిటని ప్రశ్నించారు. సినిమా రిలీజ్ కాకముందే భయపడుతున్నారంటే బీఆర్ఎస్ నాయకులు రజాకార్ వారసులుగా భావిస్తున్నామన్నారు. నిజాం సమాధి ముందు మోకరిల్లిన మూర్ఖులు. రజాకార్ సినిమాలో ఏమైనా అభ్యంతరాలుంటే కోర్టుకు వెళ్లాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ వారంటీ లేని పార్టీ అని, వాళ్లిచ్చే గ్యారంటీలను నమ్మేదెవరు? పొరపాటున కాంగ్రెస్‌కు అధికారమిస్తే కేంద్రం ఇచ్చే పైసలతోపాటు తెలంగాణ ప్రజలు పన్నుల రూపంలో కట్టే పైసలను కూడా దోచుకుంటారన్నారు.



**ఎంఐఎం మైనార్టీల సంక్షేమం కోరితే రాష్ట్రమంతటా పోటీ చేయాలి**

కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందనే విషయాన్ని చెప్పిందే అక్బరుద్దీన్ ఒవైసీ అని సంజయ్ వ్యాఖ్యానించారు. తాము చెప్పిన వాళ్లకే పదవులొస్తాయని, తాము చెప్పిన వాళ్లే పాతబస్తీలో పోటీ చేస్తారని, మా అనుమతి లేనిదే పాతబస్తీకి రాలేదని ఒవైసీ చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దారుస్సలాంకు జీ హుజూర్ అంటోందెవరు? ఎంఐఎం ఎంగిలి బతుకుల కోసం సూట్ కేసులు పంపుతోందెవరన్నారు. ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటి కాదని భావిస్తే, వాళ్లు ఎంగిలి మెతుకులకు ఆశపడేది నిజం కాకపోతే, నిజంగా అల్లా భక్తులైతే, మైనారిటీల పక్షాన ఉంటే, ఎంఐఎం నేతలు తెలంగాణ అంతటా పోటీ చేయాలని సవాల్ విసిరారు. యావత్ ముస్లిం సమాజం కూడా ఎంఐఎం పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

## రైతుల అభ్యున్నతిపై కేంద్రం ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

విధులు, భవిష్యత్తులో సహకార రంగ బలోపేతం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామీణ భారతంలో వ్యవసాయ రంగం అభివృద్ధి దృష్ట్యా క్షేత్రస్థాయిలో సహకార సంఘాల ద్వారా రైతులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని ప్రధాని మోడీ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఈ క్రమంలోనే అన్నదాతల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వీటి ద్వారా వ్యవసాయంలో రాబడులు మరింత పెంచేందుకు, సహకార సంఘాలు మంచి తోడ్పాటు ఇవ్వాలని ప్రధాని ఆదేశమన్నారు. ఈ నేపథ్యంలో నేపథ్యంలో అఖిల భారత సహకార సంఘం వ్యవసాయం పట్ల నిరంతరం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో సహకార సంఘాలు జోరుగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ సంఘాల ద్వారా రైతులు తమ మూలధనాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ రంగం మాదిరిగా పని చేసే ఈ సహకార సంఘం ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు సహాయం అందిస్తాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల ఈ సంఘాలు రైతులను సంఘటితం చేస్తూ రాబడులు పెరిగేలా సహకరిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు సంఘటితంగా ముందుకు సాగితే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఈ విషయంలో తమిళనాడు సహకార వ్యవస్థ చాలా బలంగా ఉందని వెల్లడించారు. సాగుదారులను వికేంద్రీకరణం చెయ్యడం ద్వారా ఉత్తమ శిక్షణ, వైవిధ్యమైన పద్ధతులు, ఆవిష్కరణలు చేయవచ్చని తెలిపారు. వీటి వల్ల రైతులు పెద్ద ఎత్తున ఆర్థికంగా మంచి లాభాలు పొందుతున్నారన్నారు. ప్రజాస్వామ్య భారతంలో గ్రామ పంచాయతీలు మూలస్థంభాలు అని అవి బలంగా పనిచేస్తే వ్యవసాయంతోపాటు అన్ని రంగాల్లో స్వయం సంవృద్ధి సాధించవచ్చని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పేర్కొన్నారు.

## ఊదరగొట్టే ఉపన్యాసాలు కాంగ్రెస్‌కు అలవాటే

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి జగదీశ్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్.. బిల్యా నాయక్, ఆయన అనుచరులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌తో మాత్రమే గిరిజనులకు న్యాయం జరుగుతదని చెప్పి బీఆర్ఎస్‌లో చేరుతున్నానని బిల్యా నాయక్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. ఇవాళ వాస్తవం ఏందంటే.. దశాబ్దాలు కొట్లాడితే పరిష్కారం కాని సమస్యలు మేం అడగకముందే పరిష్కారం చేశారని బిల్యా నాయక్ అన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. 30 వేల మంది గిరిజన బిడ్డలు.. వార్డు మెంబర్ల నుంచి సర్పంచ్‌ల వరకు ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. ఇది మాకు ఒక కానుక అని బిల్యా నాయక్ తెలిపినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఫ్లోరోసిస్‌ను రూపుమాపిన నాయకుడు కేసీఆర్ మాత్రమే అని చెప్పారు. అన్నింటికి మించి గిరిజన జాతికి రిజర్వేషన్లు కల్పించారు. మా తండాలకు త్రీ ఫేజ్ కరెంట్ వస్తుందని బిల్యా చెప్పారు. విద్యా, ఉద్యోగాల్లో 6శాతం నుంచి 10శాతానికి పెంచిన మొనగాడు కేసీఆర్ అని ఆయన చెప్పారు. ఇన్ని కారణాల వల్ల బీఆర్ఎస్‌లోకి వస్తున్నాను. రాజకీయంలో కూడా చూసుకోవాలని కాకపోతే ఇన్ని కారణాలు ఉన్నాయని బిల్యా నాయక్ చెప్పారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రవీంద్ర నాయక్, బిల్యా నాయక్ మంచి మిత్రులమని చెప్పారని కేటీఆర్ తెలిపారు. ఎలక్షన్లప్పుడే తిట్టుకుంటాం తర్వాత మంచిగానే ఉంటామని చెప్పారు. భవిష్యత్‌లో కూడా కలిసే ఉంటాం.. ఇద్దరు నాయకులు కలిసిన తర్వాత.. దేవరకొండ నియోజకవర్గంలో 60 వేల మెజార్టీ రావాలని కేటీఆర్ సూచించారు. గత 15 రోజుల నుంచి 32 నియోజకవర్గాలకు వరకు తిరిగానని కేటీఆర్ గుర్తు చేశారు. ఆదిలాబాద్ నుంచి వనపర్తి దాకా, సత్తుపల్లి నుంచి మెదక్ వరకు.. తెలంగాణలోని నాలుగు మూలాలను తిరిగాను. ప్రజల మూడ్ స్పష్టంగా కనబడుతోంది. ప్రజల నుంచి అసహనం వ్యక్తం కావడం లేదు. ప్రభుత్వం మీద వ్యతిరేకత కనబడకపోగా, కేసీఆర్ తిరిగి సీఎం అయితేనే పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాలు బాగుంటారని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ పార్టీ వాళ్లు.. కొత్త అంగిలాగు కుట్టించుకుంటారు. ఇండ్లకు సున్నాలు వేసుకుంటారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రి తానంటే తాను అని పోటీ పడుతారు. ఇక మీడియాలో కూడా సర్వే వస్తది. అంతా అయిపోయిందంటారు. గమ్మత్తైన డైలాగులు, ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇస్తారు. 2018లో అప్పుడు పీసీసీ ప్రెసిడెంట్ ఉత్తమ్ కుమార్ రెడ్డి. కేసీఆర్‌ను ఓడించే దాకా గడ్డమే తీయను అని స్టేట్‌మెంట్ ఇచ్చారు. మరి ఉత్తమన్న గడ్డం ఉందో పీకిందో తెలియదు గానీ, ఇలాంటి డైలాగులు మస్తుగా విన్నాం. ఇప్పుడున్న రేవంత్ రెడ్డి కూడా డైలాగులు కొట్టిండు. కొడంగల్‌లో నన్ను ఓడిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్టేట్‌మెంట్ ఇచ్చిండు. ఆ సన్నాసి మళ్లా పోటీ చేస్తుండు.. అది వేరే విషయం కానీ.. ఇలా బేకర్ డైలాగులు కొడుతారు. ఐదారేండ్ల కింద ఓటుకు నోటు.. ఇప్పుడేమో సీటుకు నోటు.. అందుకే రేవంత్ రెడ్డిని ఇప్పుడు రేటంత రేటంత అని అంటున్నారు. వాళ్లతోటి ఏం కాదని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## యువత కోసం మేరా యువ భారత్..

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. యువత నైపుణ్యాభివృద్ధికి ఒక డిజిటల్ వేదికను తీసుకురావడమే మై భారత్ ప్రాథమిక లక్ష్యమని అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. యువత తమకు కావాల్సిన అవకాశాలను పొందడంతో పాటు సుసంపన్న భారత్ ఏర్పాటుకు ప్రభుత్వానికి, పౌరులకు మధ్య వారధులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ వేదిక ద్వారా 15–29 మధ్య వయసు ఉన్న వారికి ప్రయోజనం చేకూరుతుందని మంత్రి తెలిపారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కేబినెట్ భేటీలో కొన్ని ఖనిజాలకు సంబంధించి రాయల్టీ రేట్లను నిర్ణయించారు. లిథియం, నియోబియం ఖనిజాలకు 3శాతం, అరుదుగా లభించే 1శాతం చొప్పున రాయల్టీ విధించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మూడు ఖనిజాలకు దేశంలోనే తొలిసారిగా కేంద్రం వేలం నిర్వహించబోతోంది.

## బీఆర్ఎస్ ఎంత ఏడ్చినా గెలుపు కాంగ్రెస్‌దే

**భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

నల్గొండ, అక్టోబర్ 11 (మనం న్యూస్): బీఆర్ఎస్ నేతలు.. ఎంత ఏడ్చినా నల్గొండలో గెలిచేది నేనేనని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగి పోయారని అన్నారు. ఇచ్చిన హామీలు మరచి కుటుంబ సంక్షేమ పాలన సాగించారని అన్నారు. బుధవారం నాడు నల్గొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇప్పటికే 70 మంది ఉన్నా సింగిల్ పేర్ల జాబితాను ఫైనల్ చేశాం. తదుపరి డబుల్ పేర్లు ఉన్న లిస్ట్‌లో పేర్లు పరిశీలించక లిస్ట్‌ను ఫైల్ చేస్తాం. వీలైతే మొత్తం లిస్ట్ ఒకేసారి విడుదల చేస్తాం. కుదరకపోతే దసరా ముందే 16 తేదీ లోపు 70 మందితో మొదటి లిస్ట్ ప్రకటిస్తాం. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటే. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడానికే కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కుటుంబ పార్టీ. కాంగ్రెస్ పార్టీలో కులాల వారీగా అందరికీ న్యాయం చేస్తాం. కమ్యూనిస్టులతో చర్చలు జరుగుతున్నాయి. ఒక్కో పార్టీకి ఒక్కో సీటు లేకుంటే రెండు ఎమ్మెల్సీలు ఇస్తామని అన్నారు. కమ్యూనిస్టులతో పొత్తు ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీకి ఒంటరిగా గెలిచే సత్తా ఉంది. ధరణితో ఒక్కో ఎమ్మెల్యే వెయ్యి కోట్లకు అవినీతికి పాల్పడ్డారు.

## సంస్కారం లేకుండా విమర్శలా

(మొదటిపేజీ తరువాయి)

కాలేదన్న ఫ్రస్టేషన్లో కేటీఆర్.. తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేంద్రానికి సహకరించకుండా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్నికలు అంటే మద్యం, డబ్బు అయిపోయిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్వి అవకాశవాద రాజకీయాలని విమర్శలు గుప్పించారు. ఈనెల 16 తర్వాత బీజేపీ లిస్ట్ కూడా వస్తుందని లక్ష్మణ్ తెలిపారు. అన్ని వర్గాల వారికి బీజేపీ మాత్రమే సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. నోటిఫికేషన్లోపే మేనిఫెస్టో, చార్జి షీట్ కూడా విడుదల చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా ఎక్కడ.. కేటీఆర్ ఎక్కడ.. పెద్దవారిని తిడితే పెద్దవాన్ని అవుతానని అనుకుంటున్నావా. బీఆర్ఎస్ వ్యతిరేక పవనాలు రాష్ట్రంలో వీస్తున్నాయి. ఒక రూపాయి ఇచ్చి పది రూపాయలు గుంజుతున్నారు. నదులకు నడక నేర్పడం ఏమో కానీ మద్యాన్ని ఏరులై పారించారు. గుజరాత్‌కు వెళ్లి చూసి వస్తారు. అదే గుజరాత్ మోడల్నీ ఎగతాళి చేస్తారు. అని లక్ష్మణ్ మండిపడ్డారు.

## సింగరేణి ఎన్నికలు వాయిదా..

(మొదటిపేజీ తరువాయి)

తీర్పు ఇచ్చింది. నవంబర్ 30వ తేదీ లోపు ఓటర్ లిస్ట్ రెడీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇవాల సింగరేణి ఎన్నికల పై నేడు కీలక విచారణపై హైకోర్టు తీర్పుతో ఉత్కంఠకు తెరలేపింది. ఈ నెల 28న సింగరేణిలో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర కార్మిక శాఖ సిద్ధమైంది. ఎన్నికలపై హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సింగరేణి యాజమాన్యం అప్పీల్ చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల కారణంగా సింగరేణి ఎన్నికలు వాయిదా వేయాలని సింగరేణి యాజమాన్యం కోరింది. గత ఏడాది నుండి హై కోర్ట్‌లోనే సింగరేణి ఎన్నిక వివాదం జరుగుతుంది. ఎన్నికల నిర్వహణపై గడువు పొడగిస్తు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే 3 సార్లు ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 23న సింగరేణి ఎన్నికలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిర్వహించల్సిందిగా సింగిల్ బెంచ్ ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వుల పై సింగరేణి యాజమాన్యం చీఫ్ కోర్ట్‌లో అప్పీల్ చేసింది. నేడు సింగరేణి ఎన్నిక పై హై కోర్ట్ తీర్పు కోసం చూస్తున్న వారికి స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## 14న సీఈసీ భేటీ..

న్యూఢిల్లీ, అక్టోబర్ 11 : తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఈ నెల 14న ఢిల్లీలో భేటీ కానుంది. అంతకంటే ముందురోజు తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ సమావేశం మరోమారు జరగనున్నట్టు తెలుస్తోంది. ఈనెల 14న సీఈసీ భేటీ తర్వాత ఏ క్షణమైనా తెలంగాణ అభ్యర్థుల తొలి జాబితా వస్తుందని, దసరా తర్వాత మలి జాబితా రానుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి, స్క్రీనింగ్ కమిటీ సమర్పించిన నివేదికల ఆధారంగా సీఈసీ ఫైనల్ చేయనుంది. ఏఐసీసీ కార్యాలయంలో జరిగే ఈ భేటీపై ఇప్పటికే కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 9న భేటీ అయిన స్క్రీనింగ్ కమిటీ 70కిపైగా స్థానాల్లో ఒక్కో అభ్యర్థిని, మిగతా స్థానాల్లో ఇద్దరేసి అభ్యర్థుల పేర్లతో జాబితాను రూపొందించింది. ఒక్కో స్థానంలో ఖరారైన అభ్యర్థుల జాబితాపై సీఈసీలో ఎలాంటి అభ్యంతరాలు లేనిపక్షంలో వాటిని యథావిధిగా ఆమోదించనున్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే సహేతుక కారణాలను చూపి మరో అభ్యర్థిని ముందుకు తెచ్చే అవకాశాలుంటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఇద్దరేసి అభ్యర్థులున్న చోట్ల ఎంపిక నిర్ణయానికి సీఈసీ కొన్ని మార్గదర్శకాలు సూచిస్తుందని, వాటికనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెబుతున్నాయి. ఈ నెల 16 లేదా 18న తొలి జాబితా విడుదల చేసేలా ఇప్పటికే నేతల నుంచి హైకమాండ్‌కు ఒత్తిళ్లు పెరిగాయి. దానికి అనుగుణంగా వారంలోనే జాబితా విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## గెలిచేది పక్కా గులాబీ జెండా

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. 2001లోనే ప్రతి మండలంలో గులాబీ జెండా ఎగిరిన గడ్డ అని.. గులాబీ జెండా అడ్డ అన్నారు. జనగామలో గెలిచేది పక్కా గులాబీ జెండా అన్నారు. ఢిల్లీని కదిలించి.. కేసీఆర్ తెలంగాణ సాధించారన్నారు. రాష్ట్రం కోసం ఉమ్మడి రాష్ట్రంలో గులాబీ జెండా కప్పుకున్న ఎమ్మెల్యేలు రాజీనామా చేశారన్నారు. 2010లో తెలంగాణల ఉద్యమ సమయంలో పల్లా పరిచయమన్నారు. సీఎం మీటింగ్ లక్ష మందితో జరగాలన్నారు. కేసీఆర్ సభను కార్యకర్తలు ముందుండి నడపాలన్నారు. కార్యకర్తల కాళ్లు కడిగి నెత్తిలోపోసుకున్నా తక్కువేనన్నారు. నిండు మనసుతో దీవించడమే బీఆర్ఎస్ క్రమశిక్షణ అని, కాంగ్రెస్ వారి మూటలు, మాటలు.. మటలు కుర్చీల కోసమేనన్నారు. కాంగ్రెస్కు 11 సార్లు అవకాశం ఇచ్చినా చేయలేని అభివృద్ధిని 11 సంవత్సరాల్లోపే కేసీఆర్ అభివృద్ధి చేశాడన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కైలాసం నుంచి పెద్దపాము మింగితే కిందపడ్డట్టేనని.. 156 మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని, 16న జనగామ బహిరంగ సభకు హాజరవుతారన్నారు. కాంగ్రెస్వి అట్టి మాటలేనని.. బీఆర్ఎస్ చేతల ప్రభుత్వమన్నారు. 2009 మేనిఫెస్టోలో కాంగ్రెస్ మేనిఫెస్టోను తుంగలో తొక్కిందని, కేసీఆర్ మేనిఫెస్టోను పూర్తిగా అభివృద్ధి చేశారన్నారు. ఓట్లకోసం ఆలోచించడం కాదని.. పేదల కోసం ఆలోచించే నేత కేసీఆర్ అన్నారు. జనగామలో బీఆర్ఎస్ గెలుపు విషయంలో డౌటే లేదని.. భారీ మెజారిటీ రావాలన్నారు. సీఎం కేసీఆర్‌కు భారీ స్వాగతం పలకాలని, పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలన్నారు. బీఆర్ఎస్లో బేధాభిప్రాయాలు లేవని.. అందరు ఒకటే అభివృద్ధి చేసుకున్నానన్నారు. అందరూ ముందుకు నడవాలని, అద్భుత విజయం సాధించాలన్నారు.

## పల్లాకు రెవెన్యూ డివిజన్ సెగ

- ఎమ్మెల్సీని అడ్డుకున్న జేఏసి నేతలు
- గో బ్యాక్ అంటూ నేతల నినాదాలు



చేర్యాల, అక్టోబర్ 11, (మనం న్యూస్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం ఆపేది లేదని జేఏసి నాయకులు అన్నారు. చేర్యాల పాత బస్టాండ్ వద్ద చేపట్టిన చేర్యాల రెవెన్యూ డివిజన దీక్షలు బుధవారం 31వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో కొమురవెల్లి వైశ్య సంఘం సభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ స్వచ్ఛందంగా కిరాణ షాపులు, వ్యాపార సంస్థలు చేర్యాల పట్టణం మొత్తం సంపూర్ణ బంద్ పాటించారు. ఈ క్రమంలో జనగామ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నియమంచడంతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఉదయం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకొని బిఆర్ఎస్ కార్యకర్తలతో బైక్ ర్యాలీతో జనగామలో సమావేశం నిర్వహించేందుకు కార్యకర్తలతో తరలి వెళ్లే క్రమంలో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గత కొన్ని రోజులుగా జేఏసి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల వద్దకు పల్లా రాజేశ్వర్ రెడ్డి తన కార్యకర్తలతో వెళ్లగా ఒక్కసారిగా జేఏసి నాయకులు వివిధ పార్టీల నాయకులు కుల సంఘాలు పల్లా గో బ్యాక్ పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జేఏసి నాయకులు, పల్లా వర్గీయులు నినాదాలు చేస్తుండడంతో చేర్యాల పోలీసులు ఇరు వర్గాల నాయకులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన కార్యకర్తలతో వెనుదిరిగి వెళ్లారు.

## బిఆర్ఎస్‌కు షాక్

- బీజేపిలో చేరిన చందాపూర్ సర్పంచ్
- పార్టీలో అవమానాలు భరించలేకే పార్టీ మారానంటున్న బొడ్డు నర్సింలు



తొగుట, అక్టోబర్ 11, (మనం న్యూస్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో గెలిచి సత్తా చాటాలనుకుంటున్న బిఆర్ఎస్ పార్టీకి తొగుట మండలంలో ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన చందాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు నర్సింలు బుధవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. పార్టీ మారిన అంశంపై సర్పంచ్ బొడ్డు నర్సింలును 'మనం' న్యూస్ ప్రశ్నించగా ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరి మూలంగానే తాను పార్టీని వీడానని, ఉద్యమ కాలం నుండి నేటి వరకు బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేశామని, నాడు ఎంపిగా నేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తదనంతరం ఏనాడూ తనను పట్టించుకోలేదని, కార్యకర్తలు ఎంతో కష్టపడి పునాదులు వేసిన పార్టీని ఎంపి ప్రభాకర్‌రెడ్డి సరైన పంథాలో నడిపించలేకపోతున్నారని, ఎంపి వైఖరి ఇలాగే కొనసాగితే పరిస్థితి చేయిదాటిపోయి కారు స్టీరింగ్ అదుపు తప్పిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపి పార్టీ గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు.

## మంత్రి హరీష్‌రావు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి



తొగుట, అక్టోబర్ 11, (మనం న్యూస్): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై అక్రమ కేసులు పెట్టిస్తున్న మంత్రి హరీష్‌రావు దిగజారుడు రాజకీయాలు మాని హుందాగా వ్యవహరించాలని బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ, మంత్రి హరీష్‌రావుచే సిద్దిపేట మనోహరాబాద్ రైలు మార్గాన్ని వర్చువల్‌గా ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌ను మంత్రి హరీష్‌రావు ధ్వంసం చేయడం సరికాదని, ఎంపి ప్రభాకర్‌రెడ్డి ప్రధాని మోదీ ఫోటో ఉన్న ఫ్లెక్సీని సైతం చించివేయడం వంటివి చేయడం ప్రధానిని అవమానపరిచే చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడడం జరిగిందన్నారు. ఇలాంటి చట్ట విరుద్ధ చర్యలను ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సంఘటనకు బాధ్యులైన వారిపై ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని, దీంతో మంత్రి హరీష్‌రావు ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై బీజేపి జిల్లా అధ్యక్షులతో పాటు పలువురిపై అక్రమ కేసులు పెట్టించడం జరిగిందన్నారు. గత ఉప ఎన్నికల సమయంలో కూడా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, గౌరవప్రదమైన స్థానాల్లో ఉండి ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. మంత్రి ఎన్ని అక్రమాలకు పాల్పడినా చివరకు ధర్మాన్ని గెలిపించుకునే సత్తా బీజేపి నాయకులకుందని గ్రహిస్తే మంచిదన్నారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలను ఇకనైనా మానుకొని ధర్మబద్ధంగా రాజకీయాలు చేయడం అలవాటు చేసుకుంటే రాబోయే తరాలు ఆదర్శవంతమైన నాయకులు, మంచి లక్షణాలు అలవాటు చేసుకుంటారన్నారు.

# ముదిరాజ్‌లను పట్టించుకోని గత ప్రభుత్వాలు

- బిఆర్ఎస్‌తోనే దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి
- సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాక అభివృద్ధి చేస్తా
- ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక టౌన్, అక్టోబర్ 11, మనం న్యూస్: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, ఎన్నికలప్పుడు వచ్చి మా



యమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దని ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రోజున దుబ్బాక పట్టణంలోని పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముదిరాజ్‌లు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని పాలించిన ఏ పార్టీలు కూడా ముదిరాజ్‌లను పట్టించుకున్న పాపాన పోలేదని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదిగేందుకు చేపలు పట్టేందుకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే రాష్ట్రంలోని ప్రతి చెరువుకు జలకళ సంతరించిందని, ఈ ప్రాంత ప్రజలకు సాగునీటి కష్టాలు తీర్చేందుకు మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టు నిర్మించడం జరిగిందన్నారు. నేడు కూడవెల్లి జలకళతో కళకళలాడుతుందంటే అది కేసీఆర్ వల్లే అన్నారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసి తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, మరోమారు రాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో దుబ్బాక అభ్యర్థిగా బరిలో నిలిచానని గజ్వేల్, సిద్దిపేట తరహాలో దుబ్బాకను అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. ఎన్నికల ముందు కొంతమంది కొత్తతరహా తాయిలాలకు తెరలేపారని, ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మి మోసపోవద్దన్నా



రు. దుబ్బాక ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఓటేసి దుబ్బాక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గతంలో ముదిరాజ్‌లు బిఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని, ఈసారి కూడా బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపి దుబ్బాకలో బిఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మాడబోయిన రాజు, కౌన్సిలర్ దేవుని లలిత చంద్రయ్య, పర్స రవిందర్, దేవుని రాజు, పర్స కృష్ణ, మల్లయ్య, నాగరాజు, మల్లేశం, దేవుని రమణ, పర్స కార్తీక్, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నుండి బిజేపిలోకి వలసలు

- గ్రామాలకు కేంద్ర నిధులు తప్ప రాష్ట్ర నిధులు లేవు
- బిసిల సంక్షేమం కోసం కృషి చేసేది భాజపానే
- వివిధ మండలాల నుండి బిజేపిలో చేరిన ప్రజాప్రతినిధులు
- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక, అక్టోబర్ 11, మనం న్యూస్: గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం బాగుపడుతుందని భావించి ఎంతో మంది యువత తమ గ్రామాలను అభివృద్ధి బాటన పరిచేందుకు ప్రజాప్రతినిధులుగా గెలిచారని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిధులు రాక అభివృద్ధి జరగక విసుగుచెంది బీజేపి పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని నమ్మి నేడు బీజేపి పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం రోజున దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి, తొగుట, రాయపోల్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు రఘునందన్‌రావు సమక్షంలో బిజేపి పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ఏ గ్రామాన కూడా తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేయక ఎంతో మంది సర్పంచ్‌లు తమ ఆస్తులను అమ్మి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఎన్ఆర్ఈజిఎస్ నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని నమ్మి ఎంతో మంది ఉద్యమంలో పాల్గొన్నారని, కానీ రాష్ట్రం సద్దించాక బిఆర్ఎస్ పార్టీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి ముదిరాజ్ సమావేశంలో ముదిరాజ్‌ల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందని, బిఆర్ఎస్ ఎన్నికల అభ్యర్థుల్లో ఏ ఒక్కరికి కూడా ముదిరాజ్‌లకు టికెట్ ఇవ్వలేదని, దీన్నిబట్టే ముదిరాజ్‌ల పట్ల వారికున్న ప్రేమ తెలుస్తుందన్నారు. 55 శాతం ఉన్న బిసిలకు ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని, మాయమాటలు తప్ప బిసిలకు ఏనాడు కూడా న్యాయం చేయలేదన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 70 శాతం తన మంత్రివర్గంలో బిసి, ఎస్సీ ఎస్టీ మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించారని, దీన్నిబట్టే బీజేపికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు. నేడు ఎంతో మంది బిసి ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపి వైపు చూస్తున్నారని, మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో ఇటు నియోజకవర్గంలో బిసిలందరూ బిఆర్ఎస్ పార్టీకి దూరం కావడం తథ్యమన్నారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సమాన ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేసి దుబ్బాక నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేసేందుకు కంకణబద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో నేడు జరిగే ఆర్టీఐ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): హైదరా బాద్‌లో ఈనెల 12వ తేదీన జరిగే ఆర్టీఐ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సమాచార హక్కు చట్టం సిద్దిపేట జిల్లా కన్వీనర్ గణపురం చంద్రమౌళి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జేబిఎస్ కంటోన్మెంట్ పార్క్, మీ టింగ్ హాల్‌నందు జరిగే ఆర్టీఐ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షులు జి. ముత్తు ఆదేశాల మేరకు స మాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రెసిడెంట్ బొట్టు ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, రాష్ట్ర సె క్రటరీ వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ దొడ్డె రాజేంద్రప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్‌టిఐ కన్వీనర్, కో కన్వీనర్, సభ్యులందరూ హాజరుకావాలన్నారు.

## ఆత్మ కమిటీ డైరెక్టర్‌ను పరామర్శించిన మామిడి మోహన్‌రెడ్డి



దౌల్తాబాద్, అక్టోబర్ 11, (మనం న్యూస్): దౌల్తాబాద్ మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్మ కమిటీ డైరెక్టర్ సుదర్శన్ మాతృమూర్తి మృతి చెందింది. విషయం తెలుసుకున్న దుబ్బాక బిఆర్ఎస్ పార్టీసీనియర్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి బుధవారం వారిని పరామర్శించి ఓ దార్చారు. ఆయన వెంట రాయపోల్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చారి, రాయపోల్ జెడ్పిటిసి యాదగిరి, డైరెక్టర్ ఆంజనేయులు, దౌల్తాబాద్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింటు, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ అందరి బాధ్యత

- సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయాధికారి రఘురాం



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 11, మనం న్యూస్: ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దిపేట జిల్లా ప్రదాన న్యాయాధికారి రఘురాం అన్నారు. ప్రపంచ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం రోజున సిద్దిపేట జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో భరోసా, స్నేహిత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో కలిసి సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణం నుండి విక్టరీ థియేటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డితో కలిసి ప్రధాన న్యాయాధికారి రఘురాం మాట్లాడుతూ బాలికలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బాలికల పరిరక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించేందుకు తరుచూ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లలను బరువుగా భావించి గర్భస్థ దశలోనే చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భ్రూణహత్యల నివారణ కోసం, బాలికల పరిరక్షణ కోసం అనేక పటిష్టమైన చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. బాలికలను బరువుగా కాకుండా బాధ్యతగా చూడాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలు ఎక్కడైనా వేధింపులకు గురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు మలింద్ కాంబ్లీ, శ్రావణి యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, భరోసా సెంటర్ సిఐ దుర్గా, శిశు సంక్షేమ శాఖ పిడి రాంగోపాల్, సిడబ్ల్యూసి ఛైర్మన్ రాజలింగం, న్యాయవాదులు పత్రి ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ఉపాధ్యాయుడి ఆత్మహత్య

దుబ్బాక, అక్టోబర్ 11, మనం న్యూస్: ఆరోగ్యం బాగాలేకపోవడంతో చాలా కాలంగా పాఠశాలకు వెళ్లక ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఎమ్మాజిగారి మల్లయ్య కుమారుడు ఎమ్మాజి రమేష్ (48) ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గత రెండు సంవత్సరాల క్రితం తనకు పక్షవాతం రావడంతో మందులు వాడుతూ, ఇంటి దగ్గరే ఉంటూ మానసికంగా కుంగిపోయాడు. కాగా పక్షవాతం వచ్చిన నాటి నుండి పాఠశాలకు సరిగా వెళ్లనందున ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఉండడం కన్నా చనిపోవడం మంచిదని అనుకునే వాడు. కాగా బుధవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో రమేష్ ఇంట్లో వాంతులు చేసుకుంటుండగా తండ్రి ఆరా తీయగా మందు తాగినట్లు తెలపాడు. వెంటనే అతన్ని దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. సిద్దిపేటలో వైద్యులు మరింత మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేయగా తాము ఎల్లారెడ్డిపేట



లోని అశ్విన్ ఆసుపత్రిలో చేర్చగా మధ్యాహ్నం 1:20 గంటలకు మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. తన కుమారుడికి ఇంత వరకు పెళ్లి కాలేదని, పక్షవాతం వచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడంతో జీవితంపై విరక్తి చెంది తనకు తాను మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు తెలిపారు. తమ కుమారుడి మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదన్నారు.

## ఎస్‌జిఎఫ్ అండర్-19 ఖోఖోలో రాష్ట్ర స్థాయికి తొగుట విద్యార్థినులు

- కళాశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్



తొగుట, అక్టోబర్ 11, (మనం న్యూస్): తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలు సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖోఖో క్రీడల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్ తెలిపారు. ఎంపిసి సెకండ్ ఇయర్ చదువుతున్న రంగబోయిన మానస, ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న సీత, మమతలు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం జరిగిందని, జిల్లా స్థాయి పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరచగా 24 జట్లతో పోటీపడి గెలిచిన విద్యార్థులతో మళ్లీ పోటీ నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం జరిగిందన్నారు. వీరు ఉమ్మడి జిల్లా తరుపున 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపిక కావడం జరిగిందన్నారు. తొగుట కళాశాల విద్యార్థులు చదువు, ఆటల్లో ముందుంటారని, కళాశాలకు మంచిపేరు తీసుకువచ్చిన విద్యార్థులను ప్రిన్సిపల్ శంకర్ నాయక్ అధ్యాపక బృందం మెమెంటోలతో సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్య ప్రకాష్, జిల్లా స్పోర్ట్స్ అధికారి సమ్మయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే ఆలయంలో అష్టాదశ పీఠాలు

- పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతి



కొండపాక, అక్టోబర్ 11, మనం న్యూస్: ఒకే ఆలయంలో అష్టాదశ పీఠాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజలు అన్ని పీఠాలను ఒకే ఆలయంలో దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా ఉంటుందని పుష్పగిరి పీఠాధిపతి శంకరభారతి అన్నారు. కొండపాక మండల కేంద్రంలోని ఆనంద నిలయంలో అష్టాదశ పీఠ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట చేసి ఆలయాన్ని పర్యవేక్షించారు. నవంబర్ మాసంలో అష్టాదశ పీఠ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అష్టాదశ పీఠాలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆధ్యాత్మికంగా ప్రజలకు ఆనంద నిలయం ట్రస్టు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ఛైర్మన్ కె.వి. రమణచారి, గ్రామ సర్పంచ్ చిట్టి మాధుర దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం


- వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్ భాషా
- సెక్టోరల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశం





జిడబ్ల్యుఎంసి, అక్టోబర్ 11, (మనం న్యూస్) : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిధికి సంబంధించి సెక్టోరల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదని, ఒక సెక్టోరల్ అధికారి పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలు ఉండే అవకాశం ఉందని, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పిడబ్ల్యుడి ఓటర్లకు ర్యాంపుల ఏర్పాటు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో ఏవైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే వెంటనే పూర్తి చేసి అన్ని వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్లో వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుండి సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సిబ్బందిని తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించడం, రిజర్వు ఈవిఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసిల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏసిపి బోనాల కిషన్, తహశీల్దార్ లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు సిఐలు వెంకటేశ్వర్లు,శ్రీనివాస్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీ హీరోయిన్ రాశిఖన్నా



హన్మకొండ, అక్టోబర్11, (మనం న్యూస్) : హన్మకొండలో హీరోయిన్ రాశి 'ఖన్నా బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా నయీంనగర్లో నూతనంగా నిర్మించిన ఓ సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఆమెతో పాటు మిమిక్రి ఆర్టిస్ట్ శివారెడ్డి కూడా ఉన్నారు. రాశిఖన్నా అభిమానులు కేరింతలతో సందడి చేశా రు. లవ్‌యూఆల్ అని అందరిని పలకరించింది, వరంగల్ షూటింగ్స్ కోసం చాలా సార్లు వచ్చానని, ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందని, మీడియా వారితో సెల్ఫీతో ఫొటో తీసుకున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



వరంగల్ కల్చరల్, అక్టోబర్ 11, (మనం న్యూస్) : వర్ధన్నపేట మండలంలోని ఇల్లందులో ఓటు హక్కును వినియోగించుకోవాలి అనే కార్యక్రమంపై టిఎస్ఎస్ కళాకారులు పాల్గొన్నారు. వారి ఆటపాటలతో ప్రాంత ప్రజలు అందరు కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలని వివరించారు. ఓటు అనేది చాలా విలువైనదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గొలుసుల రంజిత్, ఈజ్జగిరి గణేష్, బరిగల వెంకటేశ్వర్లు, మోరే సంపత్, ఆకుల పెళ్లి కుమార్, బరిగల బాబు, కుమారస్వామి, పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, అక్టోబర్ 11, (మనం న్యూస్) : కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దంపతులు దర్శించుకున్నారు. ఈ ఉదయం శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్ధ ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని, సీఎం కెసిఆర్ నేతత్వంలో తెలంగాణ రాష్ట్రం, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. బిఆర్ఎస్ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## ఉచిత కుట్టు మిషను, నిత్యావసర వస్తువుల పంపిణీ

- డాక్టర్ అనితా రెడ్డి



బాలసముద్రం, అక్టోబర్ 10, (మనం న్యూస్) : నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ అను రాగ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ అనితారెడ్డి హన్మకొండలోని స్వదార్ ఆశ్రమములో అనురాగ్ చేయూత, బాలికా దినోత్స వం కార్యక్రమంలో భాగంగా మహిళల జీవితానికి భరోసా కల్పించ దానికి కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న పావని అనే అమ్మాయికి ఉచితంగా ఉష కుట్టు మిషన్ను, సంస్థకి బియ్యం బస్తాలు, కం ది పప్పు, పండ్లు డాక్టర్ అనితా రెడ్డి అందజే యడం జరిగింది. అనంతరం జెండర్ ఈక్వాలిటి బాలికల ప్రాముఖ్యత, మహిళ సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాల పట్ల అవగాహన ఉంటేనే చట్టాలను వినియోగించుకోగలుగుతారని, ప్రశ్నించేతత్వాన్ని అలవరచు కోవాలని, తమ హక్కులను కా పాడు కోవాలని, అన్నారు. అలాగే మహిళలు స్వయం ఉపాధి శిక్షణలలో రాణించి ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడే స్థా యిలో ఉండాల ని, జీవితంలో వచ్చిన కష్టాలను మరచిపోయి పాజిటివ్ థింకింగ్‌తో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ కేటాయింపులో వివక్ష

- అనుకూలంగా ఉండే జర్నలిస్టులకు ఎమ్మెల్యే అరూరి అభయం
- అడుగులకు మడుగులొత్తే వాళ్ళే ఇళ్ళ కేటాయింపునకు అర్హులట
- సీనియర్ జర్నలిస్టులకు సైతం మొండిచేయి
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వర్ధన్నపేట జర్నలిస్టులు
- చర్చనీయాంశంగా మారిన జర్నలిస్టులకు డబుల్ ఇళ్ళ కేటాయింపు



వర్ధన్నపేట, అక్టోబర్ 11, (మనం న్యూస్) : వర్ధన్నపేటలో జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులో స్థానిక శాసనసభ్యులు అరూరి రమేష్ వివక్ష చూపుతున్నారని సీనియర్ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులను సైతం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు విషయంలో పరిగణలోకి తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలోని ప్రభుత్వ భూమిలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో జర్నలిస్టుగా పని చేస్తున్న కొంతమంది ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు అనుకూలంగా ఉండి అడుగులకు మడుగులొత్తే వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు చేయడం జరుగుతుందని తెలుసుకున్న వివిధ పత్రికలు, ఛానల్‌లో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులు బుధవారం రహస్య సమావేశం నిర్వహించిన ఘటన మండలంలో తీవ్ర చర్చనీయంశంగా మారింది. సీనియారిటి ప్రకారం ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో జర్నలిస్టులు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అరూరి రమేష్ జర్నలిస్టులలో వివక్ష చూపడం సరైంది కాదని అన్నారు. ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీరాం రమేష్, ఆత్మకూరు రాధాకష్ణ, మహ్మద్ అజీజ్, అలువాల బిక్షపతి, అయిత ప్రవీణ్ కుమార్, దొమ్మటి భాను, నాంపల్లి మల్లేశం, బుర్ర వెంకటరమణ, పవన్, కంజర్ల భాస్కర్, నరేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- దూదిపాల బుచ్చిరెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు



శాయంపేట, అక్టోబర్ 11, (మనం న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కరించబడి శాయంపేట మండలం అన్ని రంగాలలో అభివద్ధి చెందుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం శాయంపేట మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టే పథకాల గ్యారెంటీ కార్డును ఇంటింటికి తిరుగుతూ పథకాల గురించి వివరిస్తూ రాబోయే ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గోవిందపూర్ గ్రామంలో ఉన్న కొంతమంది రైతులు స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డికి సంబంధించిన బాలాజీ రోబో సాండ్ క్రషర్ నుండి వచ్చే దుమ్మి ధూళితో మేము ఆరుగాలం కష్టపడితే వచ్చే పంట తీవ్రంగా నష్టం జరుగుతుందని మమ్మల్ని ఆదుకోవాలని వారు కోరగా మేము వెంటనే మా నాయకుడు గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తీసుకెళ్లి మీ పక్షాన పోరాడి మీకు నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక జెడ్పిటిసిగా ఎన్నికై వరంగల్ జడ్పీ చైర్మన్గా కొనసాగుతున్న గండ్ర జ్యోతి ఈ మండలంలో పోటీ చేయడం కోసం గోవిందపూర్ గ్రామంలో ఓటు హక్కు కల్పించుకున్న వారు పదవిలో ఉండి కూడా ఆ గ్రామానికి ప్రభుత్వపరంగా ఎలాంటి అభివద్ధి చేయకపోగా వారి సొంత క్రషర్ల వల్ల రైతులకు కలిగే నష్టాన్ని వారు ఇవ్వకపోవడం దురదష్టకరమన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన పోరాడుతుందన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ అసమర్థ పాలనపై ప్రజలందరూ విసిగి చెంది ఉన్నారని ప్రజలంతా మార్పు కోరుకొని కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. రాబోయే ఎలక్షన్లలో నియోజకవర్గంలో గండ్ర సత్యనారాయణ రావుకి ప్రజలంతా మద్దతు పలికి వారి గెలుపు కోసం కషి చేయాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిందం రవి మామిడిపల్లి సాంబయ్య తడుక కుమారస్వామి పల్లెబోయిన శ్రీనివాస్ రాజకుమార్ రజనీకాంత్ రాజిరెడ్డి బక్కన్న బొత్త శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్



హనుమకొండ, అక్టోబర్ 11, (మనం న్యూస్) : హనుమకొండ కలెక్టర్ సిక్త పట్నాయక్ సమీకత జిల్లా కార్యాలయాల భవనంలోని గ్రీవెన్స్ హాల్ పక్కన గల హాల్‌లో (జి 36) ఏర్పాటుచేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికపుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదం మంజూరు చేయాలని అన్నారు. శాటిలైట్ ఛానెల్‌లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలి అని సూచించారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, ఎస్ఎంఎస్ ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసిఎంసీ నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తన నియామవాళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి అని స్పష్టం చేసారు. ఎన్నికల సంబంధిత పిర్యాదుల కొరకు కంట్రోల్ రూమ్‌తో పాటు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4251816ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుంది అని అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి మీడియా ది కీలక పాత్ర అని, ఎన్నికలకు సంబందించిన ఎటువంటి సమాచారం అయినా అధికారుల ద్రుష్టికి తీసుకొని రావాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ లక్ష్మణ్ కుమార్ డిఈ భూపాల్, అరుణ ఎన్నికల సిబ్బంది, సోషల్ మీడియా సిబ్బంది, జర్నలిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో 183 జిఓ అనుసరించి గిరిజనేతర అంగన్‌వాడీ టీచర్లని తొలగించాలి

వెంకటాపురం నుగూరు, అక్టోబర్ 11, మనం న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో 183 జీఓ అనుసరించి గిరిజనేతర అంగన్వాడి టీచర్లను తొలగించాలని గోండ్ వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి పూనం సాయి డిమాండ్ చేశారు. బుధవారం బుధవారం స్థానిక విశ్రాంతి భవనం ఆవరణంలో మడకం రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 183 జీఓ ప్రకారంగా గిరిజనేతరులను అంగన్వాడి టీచర్లగా ఎలా నియమిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 27/7/87 న ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలే అంగన్వాడి టీచర్లుగా ఉండాలని, 183 జీవో చెపుతుంటే కోర్ట్ ఆర్డర్లను దిక్కరించినట్టు అధికారులు వ్యవరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కొంతమంది ఆదివాసి అంగన్వాడి టీచర్లను కమ్యూనిస్టులు మభ్యపెట్టి కమ్యూనిస్టుల పబ్బం కడుపుకోవటానికి, ఆదివాసి అంగన్వాడి టీచర్లను అడ్డం పెట్టుకొని ఓటు రాజకీయం కోసం పనిచేస్తున్నారని, ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలను కమ్యూనిస్టులు ఏం అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు, ఆదివాసులను మోసం చేయటమే కమ్యూనిస్టు పార్టీల సిద్ధాంతమా, ఆదివాసులకు సమాధానం చెప్పాలని, లేదంటే ఏజెన్సీ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీలను ఏజెన్సీ గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని ఆదివాసీ సమాజానికి పిలుపునిచ్చారు, వెంకటాపురం, వాజేడు మండల కేంద్రాలలో గిరిజనేతరుల అంగన్వాడి టీచర్లను వెంటనే బదిలీ చెయ్యాలని, షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతర అంగనవాడి టీచర్లను వెంటనే తొలగించాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని ఆయన హెచ్చరించారు, వెంకటాపురం మండల కేంద్రంలో కమ్యూనిస్టులు ఆదివాసులకు ఎంత భూములు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు, 183 జీవోను పటిష్టంగా అమలు చేసి ఆదివాసి అంగన్వాడి టీచర్లకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## కరెంట్ షాక్ తగిలి మాజీ సర్పంచ్ మృతి



లింగాల ఘనపురం, అక్టోబర్ 11, (మనం న్యూస్) : కరెంట్ షాక్ తగిలి మాజీ సర్పంజ్ ముస్కు మల్లారెడ్డి (50) మతి చెందిన సంఘ టన మండలంలోని బండ్లగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చేందిన మల్లారెడ్డి ఉదయం తన ఇంటి ఆవరణంలో ఉన్న నీటి మోటార్‌కు విద్యుత్ సరఫరా కావటం లేదని దీనికి ఆ మోటా ర్‌కు సంబంధించిన విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి మతి చేందినాడు.

## కీర్తన పుష్పాలంకరణ వేడుక



హన్మకొండ, అక్టోబర్ 11, మనం న్యూస్ : గొల్లపల్లి చంద్రుగొండకు చెందిన బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కత్తుల సుమలత సదానందం కుమార్తె కీర్తన పుష్పాలంకరణ వేడుకకు హాజరైన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ జాటోత్ రమేష్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య, మండల పార్టీ ముఖ్య నాయకులు క్లస్టర్ బాధ్యులు మారం రాము, లావుడ్య హరికిషన్, రవీందర్ రెడ్డి, కొమ్ము రమేష్ యాదవ్, తాటిపల్లి శివ, దొనికల సారంగ పాణి, వీరాస్వామి, భక్కి కుమార్, స్థానిక సర్పంచ్ లింగాల విజయ వెంకన్న, బంజరు పల్లి సర్పంచ్ స్వరూప రవి, చంద్రుగొండ సర్పంచ్ బక్కి రాజమ్మ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలి


- అప్పుడే ఎన్నికలు సజావుగా నిర్వహించగలం
- కలెక్టర్, ఎన్నికల అధికారి సిక్త పట్నాయక్ మాస్టర్ ట్రైనీ లకు స్పష్టం చేశారు




హన్మకొండ, అక్టోబర్ 11, (మనం న్యూస్) : బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనీలు ఎన్నికల నిర్వహణపై పూర్తిగా అవగాహన చేసుకున్నప్పుడే పోలింగ్ అధికారులకు ఎటువంటి సందేహాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో శిక్షణను ఇవ్వగలరని తెలిపారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండబోదని స్పష్టం చేశారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ గురించి అన్నీ తెలిసినట్లుగానే ఉన్నప్పటికీ చిన్నచిన్న పొరపాట్లు జరిగేందుకు అవకాశం ఉన్నందున వాటికి తావులేకుండా ఉండేందుకే ఈ శిక్షణ తరగతులని కలెక్టర్ వివరించారు. ఈ శిక్షణ వల్ల ఎన్నికల ప్రక్రియపై సందేహాలను నివత్తి చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఒ గణేష్, ట్రయిని కలెక్టర్ శ్రద్ధ శుక్ల, రెండు నియోజకవర్గల సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఏసీపీ శ్రీనివాస్



చిల్పూర్, అక్టోబర్ 11, మనం న్యూస్: ఎన్నికల నియమాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆయా నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్టేషన్ఘన్పూర్ ఏసిపి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల కోడ్ అమలైన సందర్భంగా స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ బస్సులతో పాటు బస్టాండ్ ప్రాంగణంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం కాకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు ఎవరు పాల్పడిన చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు అనునిత్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, అనుమతి లేకుండా రాజకీయ పార్టీలు ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించరాదని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక సీఐ సట్ల రాజు, ఎస్సైలు నాగరాజు, హరికష్ణ, బస్టాండ్ కంట్రోలర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.50 వేల మించి నగదు వెంట తీసుకెళ్లవద్దు

- కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్): ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున జిల్లాలో ప్రజలు 50 వేల రూపాయలకు మించి నగదు తమ వెంట తీసుకువెళ్ళరాదని, ఒకవేళ అత్యవసర పరిస్థితులలో తీసుకువెళ్ళాల్సి వస్తే తగిన ఆధారాలు కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతితో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలని తెలిపారు. అనుమానస్పదంగా, అసాధారణంగా గత రెండు, మూడు నెలల నుంచి నగదు జమ తీసుకోవడం లేని బ్యాంకు ఖాతాలో ఒక లక్ష రూపాయలు అంతకు మించి నగదు జమ చేయడం, తీసుకోవడం జరిగినట్లయితే సంబంధిత ఖాతా వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని, ఒక ఖాతా నుంచి ఎక్కువ ఖాతాలకు నగదు బదిలీ చేసినా, చాలా ఖాతాల నుండి ఒకే ఖాతాక నగదు బదిలీ అయినా వెంటనే సమాచారాన్ని జిల్లా ఎన్నికల అధికారికి అందించాలని తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన ఖాతాలో నగదు జమ చేసినా, నగదు తీసుకున్నా అట్టి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి అందించాలని, 1 లక్ష రూపాయలు, అంతకు మించి నగదు తీసుకున్న, జమ చేసిన రాజకీయ పార్టీల వివరాలు తెలియజేయాలని తెలిపారు. సాధారణ ప్రజలు తమ బ్యాంకు ఖాతాలలో 10 లక్షల రూపాయలు, అంతకు మించి నగదు జమ చేసిన, తీసుకున్న వివరాలను సంబంధిత శాఖ నోడల్ అధికారికి తెలియజేయాలని తెలిపారు. ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థులు తన ఎన్నికల వ్యయం కొరకు ప్రత్యేకంగా ఒక ఖాతా తెరువాలని, అట్టి ఖాతాను అభ్యర్థిగా స్వతహాగా / సంయుక్త ఎన్నికల ఏజెంట్తో కలిసి తెరువాలని, అభ్యర్థి కుటుంబ సభ్యులతో కలిసి ఖాతా తెరువరాదని తెలిపారు. అభ్యర్థి తన ఎన్నికల వ్యయాన్ని చెక్ ద్వారా, ఆర్.టి.జి.ఎస్., నెఫ్ట్ ద్వారా బదిలీ చేసుకోవచ్చని, నగదు ఎన్నికల సమయంలో 20 వేలకు మించి అట్టి ఖాతా నుండి ఇవ్వరాదని, బ్యాంకు అధికారులు అభ్యర్థులకు కావలసిన సహాయాన్ని త్వరగా అందించాలని తెలిపారు. బ్యాంకులో నగదు ఒక ప్రదేశం నుండి ఇంకో ప్రదేశానికి తీసుకువెళ్ళే సమయంలో తప్పనిసరిగా సరైన డాక్యుమెంట్లు ఉండే విధంగా చూసుకోవాలని, నగదు తరలించే వారు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, నగదు సరఫరా చేస్తే అవుట్ సోర్సింగ్ ఏజెన్సీస్, అవుట్ సోర్సింగ్. కంపెనీస్, బ్యాంక్ సంబంధిత నగదు కాకుండా ఏ ఇతర వ్యక్తులు నగదు సరఫరా చేయరాదని తెలిపారు. ప్రజలు 50 వేల రూపాయలకు మించి నగదును తమ వెంట తీసుకెళ్లరాదని, ఒకవేళ అత్యవసర పరిస్థితిలో తీసుకువెళితే సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు.

## సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి



నస్పూర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): సింగరేణి కార్మికుల సంక్షేమానికి బిజెపి కృషి చేస్తుందని జిల్లా బిజెపి అధ్యక్షులు రఘునాథ్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె న్యూటెక్ గనిలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో జిల్లా బిజెపి అధ్యక్షులు రఘునాథ్ మాటాడుతూ వచ్చే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను యజమాన్యమే చెల్లిస్తుందన్నారు. కార్మికుల సంక్షేమ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దామని ఆయన వెల్లడించారు.

## గడప గడపకు కాంగ్రెస్‌లో కొక్కిరాల సురేఖ



మంచిర్యాల, అక్టోబర్ 11, (మనం న్యూస్): మంచిర్యాలలోని రెండో వార్డులో బుధవారం నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ హామీలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సిరిపురం రాజేష్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాధవరపు జితేందర్రావు, నాయకులు సాగే సుమోహన్, కౌన్సిలర్ సల్ల మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు బాల్క ఫౌండేషన్ చేయూత



రామకృష్ణాపూర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాది, శేషపల్లి గ్రామాల్లో ఇటీవల మరణించిన శనిగారపు అమ్మక్క,నంది వెంకటస్వామి, చీమల అపర్ణ కుటుంబ సభ్యులను క్యాతనపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్ రెడ్డి,స్థానిక కౌన్సిలర్ జిలకర మహేష్ పరామర్శించి బాల్క ఫౌండేషన్ అధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో లింగయ్య,యాదగిరి,పోశం, రాజయ్య, యూత్ నాయకులు సంతోష్, అజయ్, రాము, కిరణ్, మున్న, వెంకటస్వామి, అంజి. చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాసిపేట 2 ఇంక్లైన్ గని స్థలాలను తనిఖీ చేసిన జిఎం



మందమర్రి, అక్టోబర్ 11, (మనం న్యూస్): మందమర్రి ఏరియాలోని కాజీపేట 2 ఇంక్లెన్ గని పని స్థలాలను బుధవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాసిపెట్ ఉద్యోగుల భద్రత, సామర్థ్యం, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోని మైనింగ్ కార్యకలాపాల యొక్క వివిధ అంశాలను నిశితంగా అంచనా వేశారు. కాసిపేట-2 లో కొనసాగుతున్న చైర్ లిఫ్ట్ మ్యాన్ రైడింగ్ పనులను సమీక్షించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ గనిలో పనిచేస్తున్న సిబ్బంది సౌలభ్యం భద్రతను మెరుగుపరచడానికి ఈ మాన్ రైడింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా మైనింగ్ కార్యకలాపాలు, భద్రత మరియు ఉత్పత్తి, ఇతర అంశాలు అత్యున్నతస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా వ్యూహాలు పరిష్కారాలను చర్చించారు. అలాగే గనిలోని ఎయిర్ షాఫ్ట్, వెంటిలేషన్ ని పరిశీలించి వెంటిలేషన్ను మెరుగుపరచడానికి విలువైన సలహాలు సూచనలను అందించారు. ఈ కార్యక్రమం లో ఏరియా ఇంజనీర్ జే.నాగరాజ్, గ్రూప్ ఏజెంట్ రాందాస్, గ్రూప్ ఇంజనీర్ రామ ప్రసాద్, మేనేజర్ జి. లక్ష్మినారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలో 5 లక్షల నగదు పట్టివేత



నస్పూర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): నస్పూర్ పట్టణంలో సిసిసిలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు ఒక వ్యక్తి వద్దనుండి ఐదు లక్షల స్వాధీనం చేసుకున్నారు. కుషనపల్లీ గంగారం అనే వ్యక్తి వద్ద 5 లక్షల రూపాయల నగదు లభించగా ఆ డబ్బులకు సంబంధించిన సరి అయిన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం ఎఫ్ ఎస్ టీంకి అప్పగించినట్టు తెలిపారు.

## సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు డిసెంబర్ 27కు వాయిదా

- నవంబర్ 30 నాటికి ఓటర్ల జాబితా సిద్దం చేయాలని హైకోర్టు ఆదేశం



మంచిర్యాల, అక్టోబర్ 11, (మనం న్యూస్): సింగరేణి లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికలను డిసెంబర్ 27 కు వాయిదా వేస్తూ బుధవారం తెలంగాణా హై కోర్ట్ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తీర్పు నిచ్చింది. నవంబర్ 30 నాటికి ఓటర్ల జాబితా సిద్దం చేయాలని హై కోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. డిప్యూటీ లేబర్ కమీషనర్ ఆదేశాలా ప్రకారం ఈ నెల 28 నాడు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికల్లో పాల్గొనే 13 కార్మిక సంఘాలు కూడా సింగరేణి లో ఎన్నికలను రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల తర్వాత నిర్వహించాలని కోరాయి. అలాగే యాజమాన్యం కూడా సింగరేణి ఎన్నికలు రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల తర్వాత నిర్వహించాలని వేసిన పిటిషన్ కు అక్టోబర్ 28 కి బదులు గా డిసెంబర్ 27న సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు నివ్వడం తో అందరిలో ఉత్కంఠ తొలగిపోయింది. రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ 3 న ఎన్నికల ఫలితాలతో ముగుస్తుంది కనుక సింగరేణిలో ఎన్నికలకు ఇక ఏ అడ్డంకి ఉండదు. సంబంధిత ప్రభుత్వ సిబ్బంది సహకారంతో ఎన్నికలు ,ఫలితాలు సక్రమంగా జరిగిపోతాయి. కాగా ఈ రోజు హై కోర్ట్ తీర్పు వచ్చేలోపు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో పాల్గొనడానికి హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమీషనర్ కార్యాలయంలో 15 సంఘాల్లో 14 సంఘాలు నామినేషన్స్ వేయడం మంగళవారం గుర్తులను కేటాయించడం కూడా జరిగిపోయింది. ఫైనల్ ఓటరు లిస్టు తయారు చేసి సంఘాలకు ఇయ్యడం, ఎన్నికలు జరపడమే మిగిలి పోయింది.

## శివాజీ విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు

మంచిర్యాల, అక్టోబర్ 11, (మనం న్యూస్): మంచిర్యాల హిందూ సమితి ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మి టాకీస్ చౌరస్తా ఐలాండ్‌లో బుధవారం తలపెట్టిన శివాజీ విగ్రహ స్థాపన భూమి పూజ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేదని పేర్కొంటూ వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అనంతరం వదలి పెట్టారు. ఈ సందర్భంగా హిందూఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణ హిందువుల చిరకాల కోరిక శివాజీ విగ్రస్థాపన అని అన్నారు హిందూ బంధువులు అన్ని కుల సంఘాలు పెద్దలు కార్యక్రమానికి హాజరై శివాజీ విగ్రహ స్థాపన కోసం , ఒక్కరు ఒక ఇటుక అందించి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని కోరడం జరిగిందని అన్నారు.

గత మూడు సంవస్తరాలుగా ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు.అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, విగ్ర స్తాపన విషయం లో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని తెలుపు్తూ ఈ రోజు కూడా కల్లెకర్ ను కలసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

## కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు అంశాన్ని మెనిఫెస్టోలో పెడుతున్నాం

- బిజెపి జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్



మంచిర్యాల, అక్టోబర్ 11, (మనం న్యూస్): సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు కు బిజెపి కట్టుబడి ఉందని, ఈ అంశాన్ని తమ పార్టీ మెనిఫెస్టో లో పెడుతున్నట్లు మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్ ప్రకటించారు. బుధవారం శ్రీరాంపూర్ ఆర్.కే.7 గని వద్ద అక్కడి కార్మికులతో సమావేశమయ్యారు. యువ కార్మికులను పలరించి వారి విద్యా అర్హలతలను ,వారి పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను విషయం తమ పార్టీ మెనిఫెస్టో లో పెడుతున్నామని, దమ్ముంటే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు కూడా వారి మెనిఫెస్టో లో పెట్టాలని సవాల్ విసిరారు. మా పార్టీ మెనిఫెస్టో చైర్మన్ గా పెద్దపల్లి మాజీ ఎం.పి.వివేక్ వెంకట స్వామి అని, ఇంకా కార్మికులకు చెందిన సమస్యలు అందులో ఉంటాయని అన్నారు. మా కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటే అని కే.సి.ఆర్.ఒకాయనకు 'బి' ఫాం ఇస్తే,ఇంకొకఆయనకు పైసలు ఇచ్చి గెలిపించుకుని బరాసలో చేర్చుకుంటాడని కాంగ్రెస్‌ను ఉద్దేశించి విమర్శిహించారు. సింగరేణి కి 25 కోట్ల మేర ప్రభుత్వం బకాయిలు చెల్లించవలసి ఉందని, తాము అధిఅకారం లోకి రాగానే తమ ప్రభుత్వం వెంటనే ఆ బకాయిలను సింగరేణికి ఇస్తుందని అన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, కార్మికుల బెనిఫిట్స్ కోసం బిజెపి పార్టీ కట్టుబడి ఉందని,రాబోయే జనరల్ ఎన్నికల్లో గెలిపించాలని, మాకూ ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన సింగరేణి కారిక వర్గాన్ని కోరారు. ఈ జిల్లా పరిదిలోని మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలను స్మార్ట్ సిటీస్ గా తీర్చి దిద్దుతామని అన్నారు. తన చిన్న తనం లో మంచిర్యాల మున్సిపాలిటీ 'ఏ' గ్రేడ్ మున్సిపాలిటీగా ఉండేదని, ఇపుడు లేదని, సిద్ధిపేట లాంటివి అభివృద్ధి చేసి మంచిర్యాలను మర్చిపోయారని, స్థానిక ఎం.ఎల్.ఏ. పట్టించుకోలేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికులు తమ ఓటుతో మార్పు తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బి.ఎం.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్,ఇతర నాయకులు పాల్గొన్నారు.

## బాలికలు, మహిళల రక్షణ కోసమే షీటీంలు



కొమురంభీం ఆసిఫాబాద్, అక్టోబర్ 11, (మనం న్యూస్): బాలికలు మహిళల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇంచార్జ్ సునీత అన్నారు. రెబ్బెన మండలం కెజిబివిలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురి అయినట్లయితే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీటీం ఆసిఫాబాద్ 87126 70564 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజిత, ఉపాధ్యాయులు, యాజమాన్యం షీటీం ఇన్చార్జి సునీత, షీటీంస భ్యురాలు స్వప్న, శ్రీలతలు పాల్గొన్నారు.

## మోదీ దయవల్ల మేమంతా క్షేమంగా ఉన్నాం

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 11, (మనం న్యూస్): అన్నా... మోదీ దయవల్ల ఇజ్రాయిల్‌లో మేం భద్రంగా ఉన్నాం.. ఇండియా పేరు చెప్పగానే మోదీ మోదీ అంటున్నారు. మోదీ చలువవల్ల ఇజ్రాయిల్ ప్రభుత్వం మమ్ముల్ని బాగా చూసుకుంటోంది. హమాస్ ఉగ్రవాదులు బాంబు దాడులు చేసినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు బంకర్లలో ఆవాసాలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది.. మోదీవల్ల మేం తలెత్తుకుని తిరగగలుగుతున్నాం... థ్యాంక్స్ టు మోదీ'' అంటూ ఇజ్రాయిల్‌లో నివసిస్తోన్న కరీంనగర్ వాసులు మనోభావాలు వ్యక్తం చేశారు. బుధవారం బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్‌తో ఇజ్రాయిల్ లో నివసిస్తున్న కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వారు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆయన ఇప్పటికే మా అందరికీ ఆదేశాలిచ్చారు. ఇజ్రాయిల్ నుండి ఎవరు ఫోన్ చేసినా కేంద్రానికి సమాచారం పంపండి... వాళ్లను కాపాడుకుంటామని చెప్పారు. మీకు ఏ సమస్య వచ్చినా నాకు సమాచారం పంపండి. నేను అవసరమైతే కేంద్రంతో మాట్లాడతాను.'' అంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితులంతా ''అన్నా... ఇంత బిజీగా ఉన్నప్పటికీ మీరు మాకు ఫోన్ చేసి క్షేమ సమాచారాలు అడుగుతుంటే మాకు చాలా సంతో షమేస్తుంది. హమాస్ ఉగ్రవాదులు ఎప్పుడు ఎక్కడ బాంబులు వేస్తారో తెల్వని పరిస్థితి. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం మాకు ఇబ్బంది లేకుం డా చూస్తోంది. మోదీ సూచనలతో ఇజ్రాయిల్ ప్రభుత్వం తగిన భద్రత కల్పిస్తోంది. మేమంతా బంకర్‌లో తలదాచుకుంటున్నాం. భోజనంసహా తగిన వసతులు కల్పిస్తోంది.'' అని పేర్కొన్నారు. మోదీ వల్ల తామంతా తలెత్తుకుని తిరుగుతున్నామని చెప్పిన కరీంనగర్ వాసులు మోదీ ప్రభం జనం ఇజ్రాయిల్ లోనూ కొనసాగుతోందని, ఇండియా పేరు చెప్పగానే మోదీ మోదీ అంటూ ఆప్యాయంగా చూసుకుంటున్నారని పేర్కొనడం గ మనార్హం. బండి సంజయ్‌తో ఇజ్రాయిల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వారిలో కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ కు చెందిన కరు ణాకర్ గౌడ్, అబ్రహం రాజు, సునీల్, లింబద్రి, వెల్పూర్, పోషన్న మ ద్నూర్, మొగిలి తదితరులున్నారు. వీరంతా ఇజ్రాయిల్ లో హోటల్స్ క్లీనింగ్లో ఆఫీస్ క్లీనర్లుగా, కూలీలుగా పార్ట్ టైం ఉద్యోగాలు చేసు కుంతున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ప్రత్యేక దృష్టి

- సిఐ కృష్ణ



లక్షెట్టిపేట్, అక్టోబర్ 11, (మనం న్యూస్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లక్షెట్టిపేట్ సర్కిల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఇతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సిఐ కృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని పోతపల్లి, అంకతిపల్లి, లక్ష్మీపూర్, గుల్లకోట, సూరారం, మిట్టపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఓటింగ్ కోసం వచ్చే వృద్ధులకు ర్యాంపు సౌకర్యాలు, ఇతర ఏర్పాట్ల గురించి ఎస్సై లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రం గ్రామానికి ఎంత దూరంలో ఉంది, ఏమైనా సమస్యలు ఉంటాయా? అనే కోణంలో కూడా పరిశీలించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎన్నికలు సజావుగా జరుగడానికి అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు సీఐ వివరించారు. అదే విధంగా గ్రామాల్లో ఏమైనా శాంతి భద్రతల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సీఐ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైస్తవులకు అండగా కెసిఆర్ ప్రభుత్వం

- క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్




మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్): క్రైస్తవులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం నిలబడిందని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెతేస్త ప్రార్ధన మందిరంలో ఏర్పాటుచేసిన క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా పాస్టర్ లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో హైదరాబాదు నుండి ముఖ్య వక్తగా విచ్చేసిన ఆంద్రూస్ దైవ సందేశాన్ని వినిపించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ గా మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావును ప్రభుత్వం నియమించడం జరిగిందని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలలో అతి త్వరలోనే కమిటీలు వేయనున్నట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను మెజారిటీ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐపిఎంఆర్ జిల్లా అధ్యక్షుడు ఐజయ్య. కార్యదర్శి పాస్టర్ సామ్యేల్, కోశాధికారి జూనియ, నవీన్ కుమార్ లతోపాటు పలువురు దైవ సేవకులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల నగదు పట్టుకున్న పోలీసులు

లక్షెట్టిపేట్, అక్టోబర్ 11, (మనం న్యూస్ ): ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీస్ ఫ్లయింగ్ స్వాడ్ టీం వాహన తనిఖీల్లో భాగంగా ఒక వ్యక్తి వద్ద రూ.3 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్ లక్ష్మణ్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ డబ్బులకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో డబ్బును ఫ్లయింగ్ స్కాడ్ టీం సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులను సరైన పత్రాలు లేకుండా కలిగి ఉంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ నియమ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా ఎన్నికలు సజావుగా జరుగడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ వాహన తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# లెక్క చూపకపోతే....చిక్కులే....!

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో 9 చెక్ పోస్టులు
- నిరంతర నిఘా.. తనిఖీలు షూరు
- నగదు పట్టుబడితే.. ఒప్పంద పత్రాలు, రసీదులు తప్పనిసరి
- ఇప్పటికే పలుప్రాంతాలలో రూ.1.05 కోట్లకుపైగా పట్టివేత
- పేట జిల్లా వ్యాప్తంగా మరిన్ని తనిఖీ కేంద్రాలు పెరిగే అవకాశం

సూర్యాపేట, అక్టోబర్ 11, (మనం ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నిక షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈసీ ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల సంఘం(ఈసీ) ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేయడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. అక్రమ మద్యం, నగదు, వివిధ ప్రాంతాలకు చేరకుండా పోలీసులు గట్టి చర్యలు చేపడుతున్నారు. అనుమానస్పదంగా తిరుగుతున్న వాహనాలను పరిశీలిస్తున్నారు.ఈ నేపథ్యంలో పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ చెక్ పోస్టులను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాల్లోని సరిహద్దులైన చిమిర్యాల, మఠంపల్లి, బుగ్గమాధారం, పులిచింతల, మహాంకాళి గుడెం, రామపురం, దొండపాడు గ్రామాలలో ప్రత్యేక నిఘా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా మోతె, మద్దిరాల, తుంగతుర్తి, సూర్యాపేట రూరల్, తిరుమలగిరి ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులతో పాటు జిల్లాలోని ప్రధాన కూడళ్లలో నిత్యం తనిఖీలను ముమ్మరం చేసింది. జిల్లా వ్యాప్తంగా మరిన్ని తనిఖీ కేంద్రాలు పెరిగే అవకాశం ఉందని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రస్తుత తరుణంలో నగదు చెలామణి పెరిగింది. ఒకప్పటితో పోల్చితే వివిధ సందర్భాలలో రూ. లక్షల కోట్లతో పలు రకాల అవసరాల నిమిత్తం సంపన్న కుటుంబాలు, వ్యాపారులు, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యేక సందర్భాలలో సాధారణ మధ్యతరగతి కుటుంబాలు నగదు వివిధ రకాల అవసరాలకు వినియోగిస్తుంటారు. ఎన్నికలు అమలులోకి వచ్చిన దృష్ట్యా మునపటి మాదిరిగా తేలిగ్గా తీసుకెళ్లలేరనే విషయాన్ని గుర్తించాలి. లేదంటే చిక్కులను కొనితెచ్చుకునే అవసరం ఎంతైనా ఉంది.

### నగదు పట్టుబడితే రసీదు, పత్రాలు తప్పనిసరి

రూ.50 వేలకుపైగా నగదు వెంట తీసుకుని వెళితే కచ్చితంగా రసీదు, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలి. లేకపోతే అట్టి నగదును సీజ్ చేస్తారు. రూ. 10 లక్షలకు పైగా పట్టుబడితే పరిధిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం అందజేస్తారు. ఆధాయపన్ను శాఖకు విషయం చేరుతుంది. సరైన పత్రాలు, రసీదు లేకపోతే నగదు తిరిగి పొందాలంటే చాలా ఇబ్బందులను ఎదుర్కోనాల్సి వస్తుంది. అదేవిధంగా భూముల క్రయ విక్రయాల సమయంలో భారీగా నగదు మారుతున్న రిజిస్ట్రేషన్ చేసుకునే ముందు లావాదేవిల పత్రాలు రిజిస్ట్రేషన్ ఒప్పంద పత్రాలను చూపించాల్సి ఉంటుంది.

### ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రూ. 1.05 కోట్లు పట్టివేత

ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు ఇప్పటికే మేళ్ల చెరువు రూ. 15 లక్షలు, ఆత్మకూర్ రూ. 1.80 లక్షలు, పెన్‌పహడ్ రూ. 1 లక్ష, చివ్వెంల రూ. 8.25 లక్షలు, కోదాడ పరిధిలోని రాంపుర్ చెక్ పోస్ట్ రూ. 2 లక్షలు, చిలుకూరు రూ. 45 లక్షలు, అనంతగిరి రూ. 7.30 లక్షలు, మఠంపల్లి రూ. 1.40 లక్షలు, అర్వపల్లి రూ. 1.50 లక్షలు, సూర్యపేట టౌన్ రూ. 2.50 లక్షలు, సూర్యాపేట రూరల్ రూ. 2.50 లక్షలు మొత్తం నగదు రూ. 1.05 కోట్లతో పాటు తొండ తిరిమలగిరిలో రూ. 75 వేల నగదు, 10 తులాల బంగారం, 15 కేజీల వెండి పోలీసులు వాహనాల తనిఖీల్లో పట్టుకోవడం జరిగింది.



### మధ్యం సరఫరా నియంత్రణ

సహజంగా ఒక వ్యక్తి 5, 750 ఎంఎల్ పరిమాణం కలిగిన మధ్యం సీసాలు, లేదా 10 ఆఫ్(500) ఎంఎల్ బాటిళ్లు, లేకుంటే 20 క్వార్టర్‌లు వ్యక్తిగతంగా రాకపోకలను కొనసాగించవచ్చు. 90 ఎంఎల్ కలిగిన మద్యం సీసాలైతే 40 సీసాల వరకు రవాణ చేస్తే ఏలాంటి సమస్య ఉండదు. వాటితో పాటు కాటన్ బీర్లను తీసుకెళ్లేందుకు ఎలాంటి అభ్యంతరాలు ఉండవు, దీనికి సంబంధించి అధికారులు అడిగితే తగిన కారణం చెపాల్సి ఉంది. అంతకు మించి పరిమితి దాటితే సంబంధిత అబ్కారీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవటంతో పాటు మధ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది. ఇతర రాష్ట్రాల నుండి ఒక్క సీసాను కూడా తీసుకువచ్చేందు అనుమతి ఉండదనేది ప్రజలు గమనించాలి.

## బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలి



తిరుమలగిరి, అక్టోబర్ 11, (మనం న్యూస్): మున్సిపాలిటి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్. రఘునందన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిశోర్‌కుమార్ హాజరైతున్నారని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటి ఛైర్మన్, మార్కెట్ చైర్మన్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ ఛైర్మన్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలులు, మార్కెట్ డైరెక్టర్లు, గ్రామశాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, అనుబంధం సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## జనచైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం



హుజూర్‌నగర్, అక్టోబర్ 11,(మనం న్యూస్): పట్టణంలోని ఓ ఆసుపత్రిలో మహిళకు ఏ పాజిటీవ్ రక్తం అత్యవసరం కాగా బుధవారం జన చైతన్య ట్రస్ట్ నిర్వహకులు వంశీ, పారా సాయి, శివశంకర్‌లకు తెలుపగా తక్షణమే స్పందిచి బ్లడ్‌డోనర్ సురేష్‌రెడ్డితో మాట్లాడి హస్పిటల్ వద్దకు వెళ్ళి ఏ పాజిటివ్ రక్తదానం చేయడం జరిగింది. జనచైతన్య ట్రస్ట్ తరుపున రక్తదానం చేయడం పట్ల ట్రస్ట్ సభ్యులు సురేష్ రెడ్డిను అభినందించారు. ఈ సందర్భంగా జనచైతన్య ట్రస్ట్ నిర్వాహకులు పిన పారాళ్ళ వంశీ, సాయి, శివశం కర్‌లువ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానా మని, ప్రతివ్యక్తి సంవత్సరానికి 3సార్లు రక్తదానం చేయవచ్చు అన్నారు. రక్తం అవసరం ఉన్న వారికి జన చైతన్య బ్లడ్ డోనేషన్ టీం అన్ని వేళల అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ రక్తందానం చేయాలని కోరారు.

## అధికారంలోకి కాంగ్రెస్

- నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఎంపీ ఉత్తమ్ సమక్షంలో భారీ చేరికలు



హుజూర్‌నగర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మఠంపల్లి మండలం బక్కమంతులగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చింతారెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి వారి అనుచరులు 200మంది కాంగ్రెస్‌లో చే రారు. పార్టీలో చేరిన వారందరికి పార్టీ కండువాలు కప్పిన అనంతరం ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే ప్రజలకిచ్చిన హామీలన్నీ 100శాతం అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పుతారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు కాకుండా కేవలం బీఆర్ఎస్ పార్టీ కుటుంబాలకే కేటాయిస్తున్నారని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. పార్టీలో చేరిన వారందరికి సము చితస్థానం కల్పిస్తామన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్యారెంటి స్కీం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మఠంపల్లిమండల కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య మంజూనాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లిఖార్జున్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్‌కుమార్‌దేశ్ ముఖ్, కోతి సంపత్‌రెడ్డి, కస్తాల శ్రావన్‌కుమార్, సులువ చంద్రశేఖర్, శివరాం యాదవ్, కుక్కడపు మహేష్, వంటిపులి శ్రీనివాస్, గంగసాని యల్లారెడ్డి, ఉపసర్పంచ్ వల్లపుదాసు నాగలక్ష్మి, సీతారాంరెడ్డి, శంభిరెడ్డి, ఉపేంద ర్ రెడ్డి, వీరనాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాంక్ లావాదేవిలను నిరంతరం పర్యవేక్షించాలి



సూర్యాపేట, అక్టోబర్ 11, (మనం ప్రతినిధి): ఎన్నికల కోడ్‌లో భాగంగా అన్ని బ్యాంకులలో రూ. 5 లక్షల కంటే ఎక్కువ నగదును విత్‌డ్రా చేసే లావాదేవిలపై నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కాన్ఫిరెన్స్ హాలులో ఇంటిల్జెన్స్ కమిటీ సమావేశాన్ని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలోని అన్ని టీమ్‌లు సమర్థవంతంగా పని చేయాలని, రోజువారిగా నివేదికలను అందించాలని, అక్రమ మద్యం, నగదుపై గట్టి నిఘాను పెట్టాలని, తనిఖీలలో పట్టుబడిన నగదు జమ సత్వరమే ఖాతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్ పోస్టులలో నిఘాను పెంచి ప్రతి వాహానాన్ని తనికీ చేయాలని, గ్రీన్ కమిటీకి పట్టుబడిన నగదును అన్ని ఆధారాలతో అందజేయాలని, రూ. 50 లక్షలు దొరికితే తక్షణమే సీజ్ చేయాలని ఆదేశించారు. నల్లబెల్లం, నాటు సార, మధ్యంపై గట్టి నిఘాను ఉంచాలని, దీనిలో భాగంగా పట్టుబడిన వాహానాలను సీజ్ చేయాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు 2024 కు సంబంధించి సూర్యాపేట జిల్లా నేరేడు చర్లకు చెందిన పులిశెట్టి మనీష్ సైన్స్, టెక్నాలజీ విభాగంలో చేసుకున్న ధరఖాస్తును పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన తల్లిదండ్రులను తల్లిదండ్రులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్ ప్రియాంక, ఎఎస్పీ నాగేశ్వర్రావు, ఏజిఎం జ్యోతి, చెస్ట్ బ్యాంక్ మేనేజర్ దినేష్‌కూమార్, ఎక్సైజ్ అధికారి అనిత, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, డిటిఓ రవి, డిసిఓ శ్రీధర్, సిటిఓ యాదగిరి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే రోజు 19 కుల సంఘాలకు శంకుస్థాపన విడ్డూరం

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): ఒకే రోజు 19 కుల సంఘాలకు హడావుడిగా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని టిపిసిసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9 సంవత్సరాలు నిద్రావస్థలో ఉన్న మంత్రి నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపన చేయడం శోచానీయం అని, మంత్రి ఓటమి భయానికిది పరాకాష్టఅని అన్నారు. బిసి బంధు, దళిత బంధు, రెండుపడకల ఇండ్లు, గృహలక్ష్మి, సిఎం రిలీఫ్ ఫండ్‌లు వంటివన్ని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి, 30 శాతం కమీషన్ మూటజెప్పిన వారికేనని, నిజమైన లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపుతున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని పథకాలపై ఎంక్వయిరీ చేస్తామన్నారు. సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికి వచ్చిన పార్టీ గెలుపుకు సహకరిస్తామన్నారు. గ్రామాలలోకి ఓట్ల కోసం వచ్చే అవినీతి బిఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలని తెలంగాణ ఉద్యమకారులకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అత్యాశకు పోయి మోసపోవద్దు



సూర్యాపేట అక్టోబర్ 11 (మనం ప్రతినిధి): ప్రజలు అత్యాశకు పోయి మోసపోకూడదని, సులభరీతిలో డబ్బు సంపాధించడమనేది కష్టమని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాయంలో నకిలీ బంగారాన్ని అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసి విచారణ అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన ధరంచంద్ కన్నయ్యలాల్ సోలంకి, గుజరాత్‌కు చెందిన నారాయణలు ఖమ్మం జిల్లా ఏదులాపురంలో నివాసం ఉంటు అక్కడ ఈ ఇద్దరు నిందితులు కలిసి బ్యాగుల వ్యాపారం చేస్తు జీవిస్తుండే వారని, ఈ క్రమంలో తెలంగాణలోని పలు ప్రాంతాలలో సంచరిస్తుతాము మహారాష్ట్రకు చెందిన వారమని, రోడ్డు తవ్వకాలలో భాగంగా తమకు పురాతన నాణేలు, బంగారు గొలుసులు దొరికాయని చెబుతూ ప్రజలను మోసం చేస్తుంటారని, ఈనేపథ్యంలోనే ఖమ్మంలోని కాల్వ ఒడ్డు సమీపంలో ఓ చికెన్ సెంటర్ నడుపుకునే మహిళతో పరిచయం పెంచుకుని తమ వద్దనున్న పురాతన వస్తువులు సూమారు 2 కిలోలు ఉంటాయని నమ్మబలికి, ఈ ఆభరణాలతో వెళితే చెక్ పోస్టుల వద్ద ఇబ్బందులు తలెత్తుత్తాయని, కనుక అతి తక్కువ ధరకు విక్రయించాలని అనుకుంటున్నట్లు చెబుతూనే, ఈ విషయాన్ని ఎవరికి చెప్పకూడదంటు పిల్లలపై ఒట్టు వేయించుకున్నారు.మొదటిగా అసలు బంగారం ఇచ్చి పరిశీలించుకోమ్మని చెప్పడంతో, బాధితురాలు నిజమైన బంగారు ఆభరణాలేనని నిర్ధారించుకుని, మిగిలిన బంగారు అభరణాలకు రూ. 2 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. సెప్టెంబర్ 22 తేదీన ఉదయం సమయంలో ఖమ్మం నుండి సూర్యాపేటకు రమ్మని చెప్పి అక్కడే రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లి 9 తులాల బంగారు అభరణాలు, రూ. 1లక్ష రోక్కం తీసుకుని నిందితుని దగ్గర ఉన్న మూటను పిర్యాధురాలికి అందజేశారు. వాటిని విప్పి చూడగా నకిలీ బంగారం, పూసల దండలు కనిపించడంతో మోసపోయనని తెసుకుంది. అక్కడి నుండి పరారిలో ఉన్న నిందితులు బుధవారం డీఎస్పీ నాగభూషణం పర్యవేక్షణలో సిఐ రాజశేఖర్ ఆదేశానుసారం పట్టణ ఎస్సై యాకూబ్ ఉదయం రోజువారి తనిఖీలలో భాగంగా వీరు పట్టుబడినేట్లు తెలిపారు. కేసు చేధించిన అధికారులను ఎస్పీ అభినందించారు.

## అభివృద్ధి సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- అభివద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 11, (మనంన్యూస్): ప్రభుత్వ సం క్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని 13,14వ వార్డులకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారందరికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్ళీ అధికారం బీఆర్ఎస్ పార్టీదే అని, ప్రతికార్యకర్తకు అండగా ఉంటానని పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కలిపిస్తానన్నారు. పార్టీలో చేరిన వారిలో పట్టణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు ఎన్. ప్రమోద్ కుమార్, కిరణ్, గోపాల్‌దాస్, ప్రవీణ్‌కుమార్, సాయి,లెనిన్, గోపిచంద్, ఉపేందర్, మహేష్, ప్రసాద్, రాజు, నరేందర్, వంశీ, అభి, కార్తీకర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ అధ్యక్షులు చిట్యాల అమర్‌నాథ్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రదీప్, బెల్లంకొండ అమర్; మీసాల కిరణ్, అల్వాల నరేష్, మామిడి వసంత్, కుంట ఉపేంద్రసైదులు, కోలపూడి చంటి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



## బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలి



సూర్యాపేట టౌన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): బహుజనులు రాజ్యాధికారం కోసం పోరడాలని, అందుకు బహుజనులంతా ఏకంకవాలని బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బుడిగె మల్లేష్, సూర్యాపేట నియోజకవర్గం ఇంచార్జ్, 13వ వార్డు కౌన్సిలర్ వట్టె రేణుక లు అన్నారు. బుదవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యలయంలో పట్టణంలోని 18వ వార్డు బలరాం తండాకు చెందిన కొందరు కార్యకర్తలు బిఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా వట్టె రేణుక మాట్లాడుతూ బహుజన బిడ్డగా పుట్టిన నేను ఎంతో దైర్యంగా బహుజనవాదాన్ని వినిపిస్తున్నాని, ఎవరికి భయపడాల్సిన పనిలేదని అన్నారు. బలరాం తండా ఎల్ నవీన్ నాయక్ ఆధ్వర్యంలో వచ్చిన కార్యకర్తలకు పార్టీ కండువ కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ రాష్ట నాయకులు సాంబశిగౌడ్, బీమయ్య గౌడ్, చడపంగు రవికూమార్, దాసరి శ్రీనివాస్, మైనార్టీ నాయకులు చాంద్ పాషాలు వట్టె రేణుకను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళనాయకురాళ్లు వెంపటి నాగమణి, సరిత, రమణ, నాయకులు వెంకన్న, స్టాలిన్ అంబేద్కర్, వెంకటేష్, గట్టు గోపి, గౌతమ్ నాయక్, గోపి, శ్రీరామ్, నెహ్రు, సైదా, విజయ్, మహేష్, రాహుల్, చారి, గణేష్, తదితరులు పాల్గోన్నారు.

## సుపర్ హిట్ సినిమా బ్రో ప్రసారం

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): సుపర్ హిట్ సినిమా పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్‌లు కలిసి నటించిన చిత్రం బ్రోది అవతార్ ఈ నెల 15 ఆదివారం రోజున రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఆదరించే జీ తెలుగులో ప్రపంచ వ్యాప్తంగా సాయంత్రం 6 గం.లకు ప్రసారం కానున్నట్లు జీ తెలుగు యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు అక్టోబర్ 10న మంగళవారం సాయంత్రం అభిమానులు, మీడియా సమక్షంలో 54 అడుగుల భారీ కటౌట్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ చిత్రం కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా థియేటర్లలో విడుదలైన బ్రో, ప్రేక్షకులను మెప్పించి సూపర్ హిట్ టాక్‌ను సొంతంచేసుకున్న సంగతి అందరికి తెలిసిందే. ఈ చిత్రం పవన్ కళ్యాణ్ ప్యాక్డ్ యాక్టింగ్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ వసుళ్లను కొల్లగొట్టింది. అలాంటి చిత్రం బుల్లి తెరలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుందన్నారు. ఈ చిత్రంలో పవన్‌కళ్యాణ్, సాయిధరమ్ తేజ్, ప్రియా ప్రకాశ్ వారియర్, కేతిక శర్మ, బ్రహ్మానందం, రాజా చెంబోల్, రోహిణి, తనికెళ్లబరణి, కీలక పాత్ర పోషించారు.

## విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ



హుజూర్‌నగర్, అక్టోబర్ 11, (మనంన్యూస్): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త తండు సైదారత్నం రూ. 16 వేల విలువైన డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి సైదానాయక్ మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిక్షనరీలను అందజేయడం అభినందనీయమని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. అనంతరం డిక్షనరీల దాత తండు సైదారత్నంను శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. జయవాణిదేవి, సీడీపీవో విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మాతంగి ప్రభాకర్‌రావు, ప్రసాద్, దీనారాణి, శైలజ, శ్రీదేవి, శేషగిరి, అన్వేష్, వసంతరావు, విజయలక్ష్మి, అశోక్, జానీబేగం, జానార్ధన్‌రెడ్డి, శేఖర్, మున్నిబేగం, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయం



తిరుమలగిరి, అక్టోబర్ 11, (మనం న్యూస్): రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్ అన్నారు. బుధవారం తిరుమలగిరి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో పటిష్ఠంగా ఉందని తెలిపారు. పార్టీ టికిట్ ఎవరికి వచ్చినా భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వచ్చిన తర్వాత ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అందరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చ్చిన 6గ్యారెంటీలను అమలు చేస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, మండల కార్యనిర్వహణ అధ్యక్షులు దరావత్ జుమ్మిలల్, కౌన్సలర్లు బాస్కర్, మండల కాంగ్రెస్ నాయకులు రామోజీ, యశ్వంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియామవళిని పాటించాలి

జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 11, (మనం న్యూస్): శాసనసభ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల నియామవళిని పాటించాలని ప్లైయింగ్ స్క్వాడ్ దారా శ్రీనివాస్ అన్నారు. బుధవారం జాజిరె డ్డిగూడెం మార్కెట్ యార్డు ముందు ఎన్‌హెచ్-365 పైన తిరుమ లగిరి మండలం మర్రికుంటతండాకు చెందిన బానోతు రవికు మార్ ఎలాంటి ఆదారములు లేకుండా మొత్తం రూ. 150000/-లు స్విఫ్ట్ డిజైర్ కారులో నకిరేకల్ వైపు తీసుకెళ్తుండగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల నియమావళి ప్రకారం పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల దృశ్య ప్రజలు రూ. 50వేలు మించి తీసుకెళ్లావద్దని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ బి. అంజి రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, చైతన్యలు ఉన్నారు.

## ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలి

- చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో- ఆర్డినేటర్ సంపత్

కరీంనగర్, అక్టోబర్ 11, (మనంన్యూస్): ఆడపిల్లలు మానసికంగా శారీరకంగా దృడంగా ఉండాలని చైల్డ్ హెల్ప్ లైన్ -1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్బంగా ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల, వివేకానంద రెసిడెన్సియల్ స్కూల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు, ఎన్ సి సి నేషనల్ క్యాడెట్ విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ, పిసిపిఎన్ డిటి చట్టం, బాల్య వివాహలు, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్య వివాహ చట్టం2006, లైంగిక నేరల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. ఆడపిల్లలు శారీరకంగా మానసికంగా దృడంగా ఉంటే అన్ని రంగాలలో రాణించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సభ్యులు కిరణ్, పుష్పలత, ప్రియాంక, కుమార్, నరేంద్ర, చరణ్, కళాశాల, పాఠశాల సిబ్బంది, నేషనల్ క్యాడెట్ కార్ప్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమారపు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం

- బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు



గోదావరిఖని, అక్టోబర్ 11, (మనం న్యూస్): రామగుండం ఎమ్మెల్యేగా సోమారపు సత్యనారాయణను గెలిపించుకుంటామని బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రకటించారు. బుధవారం గోదావరిఖని అడ్డగుంటపల్లిలో బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సోమారపు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా పెయింటింగ్ వర్కర్స్ సభ్యులు మాట్లాడారగతంలో సత్యనారాయణ మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసారని, కాని గత నాలుగున్నర సంవత్సరాలుగా రామగుండంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ ఎలక్షన్లో సత్యనారాయనను తిరిగి రామగుండము ఎమ్మెల్యే గా గెలిపించుకుంటామని పెయింటింగ్ వర్కర్స్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ...పెయింటింగ్ వర్కర్స్ చాలా కాలంగా అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారు చేసే పని వలన అనారోగ్యం,ప్రమాదాలకు గురికావడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండంలోని ప్రజలు తమను ఆశీర్వదించి గెలిపిస్తే ఈఎస్ఐ హాస్పిటల్ త్వరిత గతిన ఏర్పాటు చెస్తానని, కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయం లభిస్తుందని తెలిపారు. పెయింటింగ్ వర్కర్స్‌కి తాను ఎల్లపుడు అందుబాటులో ఉంటానన్నారు. అన్విక కలర్ వరల్ బాధ్యులు సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోమారపు అరుణ్ కుమార్,వీరన్నా, షేర్ ఖాన్, దిలీప భాగ్, కృష్ణ, బాబుఖాన్, సంతోష్, సంజీవ్, మోహన్, పాల్గొన్నారు.

## దేవి నవరాత్రుల కరపత్రాన్ని ఆవిష్కరించిన రవీందర్ రెడ్డి



జగిత్యాల, అక్టోబరు 11, (మనం న్యూస్): దేవి నవరాత్రుల సందర్భంగా శ్రీ హిందూ కాళీమాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక లడ్డుకాజ చౌరస్తా దగ్గర పురానిపేటలో నిర్వహించనున్న అమ్మవారి నవరాత్రోత్సవ కరపత్రాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జగిత్యాల ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో విలసిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి జ్ఞానేశ్వర్, వినీత్, మధు, వంశీ శ్రీరామ్, మనోజ్, సురేష్, రాజేష్, హరి సాయి, సంజయ్, అక్షయ్, పవన్, మనీ, కృష్ణ, ఈశ్వర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ గెలిపించండి

- ఎమ్మెల్యే పర్యవేక్షణలో వార్డును అభివృద్ది చేశాం
- మున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్ 11, (మనం ప్రతినిధి): పెద్దపల్లి పట్టణం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పర్యవేక్షణలో వార్డులను అభివృద్ధి చేశామని మళ్లీ గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి పట్టణంలోని ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం 21వార్డులో మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి ఇంటింటికి ప్రచారం చేశారు. మీఅందరి ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరూ కలిసి మళ్లీ దాసరి మనోహర్‌రెడ్డికే ఓటు వేసి హ్యాట్రిక్ విజయం అందించాలని, ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి ఓటు అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో పట్టణాధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సజావుగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సి-విజల్ యాప్
- 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు అందించాలి
- సమావేశాలకు, ర్యాలీలకు ముందస్తు అనుమతితప్పనిసరి
- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి, అక్టోబర్11, (మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీలు తమవంతు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రామగుండం సీపి రెమా రాజేశ్వరితో, డిసిపి వైభవ్ గైక్వాడ్‌లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, సీ-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు 24గంటల పాటు నమోదు చేయవచ్చని తెలిపారు. 1950టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లాలో 24గంటలు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, సీ-విజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులను 100నిమిషాలలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున ప్రస్తుతం ఉన్న పనులు, పథకాలు మాత్రమే కొనసాగుతాయని కొత్త పనులు, పథకాలు ప్రారంభించడం లేదని, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. రాజకీయ పార్టీలకు నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని,సువిధా యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చీలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100మీటర్లు పరిధిలో నిర్వహించవద్దని ఎన్నికల అధికారి సూచించారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే వి. దంగా వాఖ్యాలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయడం, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123 ఐపిసిసెక్షన్ 171 ప్రకారం అభ్యర్థులపై 6 సంవత్సరాలు నిషేదం ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. అక్టోబర్ 30వరకు నూతన ఓటరు నమోదు కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఓటరు జాబితాలో పేర్లు లేకుండా ఎవరైనా అర్హులైన ఓటర్లు ఉంటే వెంటనే దరఖాస్తు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, 24గంటల్లోగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో వివధ రాజకీయ పార్టీలకు చెందిన వివిఐపీలు, విఐపిల పర్యటన సమయంలో స్థానిక పోలీస్ అధికారులతో పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు, ముఖ్య అతిథులకు ఇబ్బందులు కలగకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని అన్నారు. సమాజిక మాధ్యమాలలో విద్వేషాలను పెంచె విధంగా పోస్టులు పెట్టడం, ఇతరులను దూషించడం, బెదిరింపులకు గురిచేయడం వంటివి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఈసమావేశంలో ఏసీపీలు ఎడ్ల మహేష్, శ్రీనివాస్‌రావు, సిఐ అనిల్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహాశీల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో ఈసారైనా గట్టి పోటీ ఉంటుందా..?

- కాంగ్రెస్, బిజెపిల రూటు ఏంటి..?

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11, (మనం న్యూస్): ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటేనే మజా వస్తుంది. అంతే గానీ చప్పగా సాగితే కిక్ ఏముంటుంది. కానీ సిరిసిల్లలో గత రెండు ఎన్నికలు చూసుకుంటే పెద్దగా పోటీ లేదనే భావన అందరికీ వస్తోంది. ఎందుకంటే ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన మంత్రి కేటీఆర్ బలమైన అభ్యర్థిగా మారిపోయారు. 2009 కంటే ముందు సిరిసిల్లలో టిఆర్ఎస్‌లో ఉన్న కేకే మహేందర్ రెడ్డి ఈ స్థానంలో కీలకంగా వ్యవహరించారు. తర్వాత మధ్యంతర ఎన్నికల్లో కేటీఆర్ కు టికెట్ రావడంతో కెకె కాంగ్రెస్‌లో చేరి ఎన్నికల బరిలో నిలుస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇద్దరి నడుమ పోటీ ఉంది. ఆ మధ్యంతర ఎన్నికల్లో ఇద్దరి నడుమ పోటాపోటీ నడిచింది. చివరకు కెటిఆర్ 171 ఓట్ల అతి తక్కువ మెజార్టీతో గెలిచారు. కానీ తర్వాత 2010 ఎన్నికల్లో కేటీఆర్ బాగా పుంజుకున్నారు. మళ్లీ కేకే మహేందర్ రెడ్డి మీదనే ఏకంగా 68వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. అక్కడి నుంచే కేటీఆర్ ప్రస్థానం మొదలైంది. గ్రౌండ్ లెవల్లో బలాన్ని బాగా పెంచుకుంటూ ముందుకు వచ్చారు. ఇక తెలంగాణ వచ్చిన తర్వాత 2014 ఎన్నికల్లో మళ్లీ బీఆర్ ఎస్ నుంచి కేటీఆర్ పోటీ చేశారు. అటే కాంగ్రెస్ నుంచి కేకే మహేందర్ రెడ్డి కాకుండా కొండూరి రవీందర్ రావు పోటీ చేశారు. అప్పుడు కాస్త పోటీ బాగానే ఇచ్చారు కొండూరి రవీంరద్ రావు. అటు బీజేపీ నుంచి ఆకుల విజయ కూడా పర్వాలేదనేలా పోటీ ఇచ్చారు.

### మళ్లీ ఆయనే దిక్కు

దాంతో అంతకు ముందు జరిగిన ఎన్నికలతో పోలిస్తే కేటీఆర్ కు మెజార్టీ తగ్గింది. 2014 ఎన్నికల్లో కెటిఆర్‌కు ఏకంగా 53వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే కొండూరి కాంగ్రెస్‌లో ఉంటే ఏనాటికైనా ప్రమాదమే అని గుర్తించిన బిఆర్ఎస్ వెంటనే ఆయన్ను తమ పార్టీలోకి లాగేసుకుంది. ఆయనకు కీలక పదవి ఇవ్వడంతో కాంగ్రెస్ కు మళ్లీ కేకే మహేందర్ రెడ్డి మాత్రమే దిక్కు అయ్యారు. అదే సమయంలో ఇటు కేటీఆర్ మంత్రిగా పని చేయడంతో జిల్లాకు కాస్త నిధులు ఎక్కువగా తీసుకురావడం. పైగా కేసీఆర్ కొడుకు కావడంతో ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే సిరిసిల్లలో ప్రతి ఇంటికి ఆయన సంక్షేమ పథకాలు అందేలా చూసుకున్నాడు.

### ఆ ఇద్దరి నడుమే పోటీ

అది ఆయనకు కాస్త ప్లస్ అయింది. రైతు బంధు, పింఛన్ల పెంపు లాంటివి బీఆర్ ఎస్ పార్టీకి బాగా కలిసి వచ్చాయి. దాంతో కేటీఆర్ ఇమేజ్ అమాంతం పెరిగింది. ఇది ప్రతిపక్షాలకు కాస్త ఇబ్బందిగా మారింది. ఇక 2018 ఎన్నికల్లో అయినా గట్టిగా పోటీ వస్తుందా అనుకున్నారు. ఆ ఎన్నికల్లో బీఆర్ ఎస్ నుంచి కేటీఆర్, కాంగ్రెస్ నుంచి కేకే మహేందర్ రెడ్డి మధ్యనే ప్రధానంగా పోటీ ఉంది. కానీ ఆ ఎన్నికల్లో కేటీఆర్ కే భారీ మెజార్టీ వచ్చింది. ఏకంగా 89వేల ఓట్ల మెజార్టీతో విజయభేరీ మోగించారు. దాంతో అప్పటి నుంచి కేకే కూడా పెద్దగా యాక్టివ్ గా ఉండట్లేదు.

### అప్పుడే ప్రచారం

కానీ ఇప్పుడు 2023 ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం ప్రతిపక్షాలు చాలా బలంగా పోరాడాలని ఫిక్స్ అయినట్టు ఉన్నాయి. బీఆర్ ఎస్ నుంచి కేటీఆర్ మళ్లీ కన్ఫర్మ్ అయ్యారు. అయితే కాంగ్రెస్ నుంచి అఫిషియల్ గా లిస్ట్ రాకపోయినా.. కేకే మహేందర్ రెడ్డి అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. ఎలాగూ టికెట్ ఆయనకే వస్తుందని అందరికీ తెలుసు. అప్పుడే గ్రామాల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోల గురించి ప్రచారం చేయిస్తున్నారు. కానీ బీఆర్ ఎస్ మాత్రం ఇంకా ప్రచారం మొదలు పెట్టలేదు.

### బీజేపీ నుంచి ఎవరు..?

బీజేపీ నుంచి లగిశెట్టి శ్రీనివాస్ పేరు బాగా వినిపిస్తోంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఈయన ఇప్పటికే చాలా సేవా కార్యక్రమాలు చేసినట్టు తెలుస్తోంది. అయితే అప్పుడే ఆయన గురించి అధికారికంగా పేరు బయటకు రావట్లేదు. కానీ ఆయన వస్తే కేటీఆర్ కు పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో పాటు.. సిరిసిల్లలో అధికంగా ఉన్న పద్మశాలీ సామాజిక వర్గం ఓట్లు ఆయనకు పడే ఛాన్స్ ఉంది. కాబట్టి ఈ సారి ప్రతిపక్షాలు బలంగా పోటీ ఇచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పుకోవాలి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## ఎస్సారార్‌లో రొబోటిక్స్‌పై కార్యశాల



కరీంనగర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ, పిజి విద్యార్థులకు రోబోటిక్స్‌పై ఒకరోజు కార్యశాలను నిర్వహించారు. సోహం అకాడమీ సహకారంతో ఆర్డినో బోర్డు ఉపయోగించి 21 రకాల రోబోటిక్ ప్రయోగాలు 60 మంది విద్యార్థుల చేత చేయించారు. విద్యార్థులు కార్యశాలలో 'బ్లింకింగ్ ఎల్ఈడి', 'బటన్ కంట్రోల్ ఎల్ఈడి', 'ఫ్లోయింగ్ ఎల్ఈడి', సెవెన్ సెగ్మెంట్ డిస్ ప్లే'టచ్ సెన్సార్ కంట్రోల్ ఎల్ఈడి', 'అల్ట్రాసోనిక్ డిస్టెన్స్ సెన్సార్', 'స్మార్ట్ ఫోన్ ఉపయోగించి హోమ్ ఆటోమేషన్' లాంటి 21 రకాల రోబోటిక్స్ ప్రయోగాలు చేయడం ద్వారా రోబోటిక్స్, సెన్సార్లకు సంబంధించిన ప్రాథమిక జ్ఞానమును ఆర్డినో-బోర్డు వినియోగించి, విశ్లేషించు సామర్థ్యాలను సముపార్జించారు. కార్యశాలను ఉద్దేశించి సోహం అకాడమీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ సహదేవ్ కొమరగిరి మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాలలో ఉన్న భౌతిక శాస్త్ర ప్రయోగశాలలు అద్భుతంగా ఉన్నాయని, విద్యార్థులు చాలా ఉత్సాహంగా కార్యశాలలో పాల్గొనడంసంతోషం కలిగించిందని పేర్కొన్నారు. నవంబర్ మాసంలో భౌతిక శాస్త్ర విభాగం సోహం అకాడమీ సమన్వయంతో రోబోటిక్స్ క్లబ్ ఏర్పాటు చేసి దాని ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారి ద్వారా కరీంనగర్ పట్టణ పరిసర ప్రాంత కళాశాలలు, పాఠశాలల్లో రోబోటిక్స్ పై ప్రాథమిక అవగాహన ఆర్డినో బోర్డు వినియోగం ద్వారా విభిన్న ప్రక్రియలను సృజనాత్మకతతో ఎలా చేయాలో కార్యశాలలను నిర్వహిస్తామని తెలిపారు. కళాశాలలోని భౌతిక శాస్త్ర విభాగంలో రోబోటిక్స్ రీసెర్చ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు నవ కల్పనలతో ప్రాజెక్టులను చేసే విధంగా ప్రోత్సహిస్తామని భౌతిక శాస్త్ర విభాగాధిపతి బి. సత్యనారాయణ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి కార్యశాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని జ్ఞాన సముపార్జననే కాకుండా దాని వినియోగ, విశ్లేషణ, అన్వయ సామర్థ్యాలను పరిపూర్ణంగా పెంపొందించుకోగలుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యశాలలో ముఖ్య భూమిక పోషించిన సోహం అకాడమీ వారిని మరియు నిర్వాహక ముఖ్యులు అయిన సహదేవ్, కార్యశాల శిక్షకులు జశ్వంత్, స్పందన, శివసాయిలను అభినందించి సన్మానించారు. ఈ వినూత్న కార్యశాలకు రూపకల్పన చేసి నిర్వహించినందుకు భౌతిక శాస్త్ర విభాగాధిపతి సత్యనారాయణ, అధ్యాపకులు కె.రామ్‌చంద్రం, యస్. కృష్ణప్రసాద్, వి.కిరణ్ కుమార్, ఎం.ఏ.షుకూర్, సి.హెచ్. నర్సింహులు తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. మల్లారెడ్డి, డాక్టర్ ఏ. శ్రీనివాస్, డాక్టర్ ఎం. అర్చన, డాక్టర్ కిషోర్ కుమార్. డాక్టర్ ఎస్. ఓ. కుమార్, డాక్టర్ టి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్ సతీమణి ప్రచారం

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్): జగిత్యాల పట్టణంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సతీమణి రాధిక బుధవారం 21 వ వార్డు లో ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మళ్లీ భారత రాష్ట్ర సమితిని గెలిపించాలని కోరారు. వెంట స్థానిక కౌన్సిలర్ అల్లే గంగ సాగర్, మహిళ కౌన్సిలర్ లు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనల మేరకు ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణ చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి, అక్టోబర్ 11, (మనం ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణను నిబంధనల ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించునప్పుడు లేదా ప్రచురించునప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ ప్రింట్ లైన్ యందు స్పష్టంగా సూచించాలని, ముద్రించబడిన ప్రతులను (ప్రింటడ్ మెటీరియల్ కాఫీలను) 3 అదనపు ప్రింట్‌లతో పాటు ప్రింట్ చేసిన మూడు రోజుల్లోపు ప్రచరణ కర్త నుండి పొందిన డిక్లరేషన్‌తో సహా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నందు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951సెక్షన్ 127(ఏ) ప్రకారం పంపాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, మొదలైన వాటి ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రోఫార్మాలో సెక్షన్ 127 ఏ (2) ప్రకారం ప్రచురనకర్త నుంచి డిక్లరేషన్ పొందాలని, డిక్లరేషన్ పై ప్రచురణ కర్త సంతకం, సూచించిన ఇద్దరు వ్యక్తులచే ధృవీకరించబడాలని,దీనిని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమాని ధ్రువీకరించాలని తెలిపారు. ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషన్‌తోపాటు సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాఫీల సంఖ్య సదరు ప్రింటింగ్ పనికి వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రింటర్లు మూడు రోజులలోపు అందించాలని, ముద్రించిన మూడు రోజులలోపు ఎన్నికల కరపత్రాలు ఫోస్టర్లు మొదలైన వాటికి సంబంధించిన సమాచారాన్ని ప్రింటర్ ఒకేసారి కాకుండా విడిగా అందించాలని, ఈఆదేశాలు ఉల్లంగిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ రద్దు చేయడంతో సహా ప్రింటింగ్ ప్రెస్ యాజమానిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి ఆప్రకటనలో పేర్కొన్నారు.

## గాయత్రిలో అంతర్జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమం




పెద్దపల్లి, అక్టోబర్ 11, (మనం ప్రతినిధి): పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జా తీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ము ఖ్యఅతిథిలుగా పెద్దపల్లి చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ ఉమాదే వి పాల్గొని విద్యార్థీనీలకు బాల్య వివాహాలపై, బాలికల వేధిం పులు, చిన్న తనంలోనే ప్రేమకు ఆకర్షితులవ్వడంపై, జరుగుతు న్న ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు, అధ్యాపక బృందం, విద్యార్థీనీలు పాల్గొన్నారు.



## వైరా నియోజకవర్గ పరిధిలో ముగిసిన బూత్ కమిటీల ఏర్పాటు



వైరా, అక్టోబర్ 11, (మనం న్యూస్): వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు మం డలాల బూత్ కమిటీలు ఏర్పాటు పూర్తి చేశారు. ఖమ్మంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్ లాల్ నివాసంలో మండలాల వారిగా బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు .ఈ బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు నల్లమల్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణోత్ మదన్ లాల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రాములు నాయక్ సూచనలతో నియోజకవర్గంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ,ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోయి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ముందుకు పోవాలన్నారు. రైతు సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జరిగిన అన్ని మండలాల బూత్ కమిటీల ఏర్పాటు పర్యవేక్షణ పూర్తి చేయడం జరిగిందని బూత్ కమిటీ సభ్యులందరూ ఆయ బూతుల పరిధిలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఖమ్మం జిల్లా జడ్జిని కలిసిన మధిర బార్ అసోసియేషన్



మధిర, అక్టోబర్ 11, (మనం న్యూస్): ఖమ్మం ప్రిన్సిపల్ జిల్లా. సెషన్స్ జడ్జి బిఎస్. జగ్జీవన్ కుమార్‌ని మధిర బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మధిరలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయటానికి సహకరించి కృషి చేసినందుకు జిల్లా జడ్జిని సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి బిఎస్. జగ్జీవన్ కుమార్ మాట్లాడుతూ మధిరలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును సాధ్యమైనంత తొందరగా ఏర్పాటు చేయడానికి, అదేవిధంగా కొత్త భవనాల నిర్మాణానికి గాను తన వంతు సహకారాన్ని అందిస్తానని బార్ అసోసియేషన్కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, ఖమ్మం అసోసియేషన్ అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భోజట్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు సుంకుమోహన్దాస్, నంబూరు జనార్ధన్ రావు, ఏడు నూతల శ్రీనివాసరావు, నెల్లూరు రవి తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 వేల నగదు తీసుకెళ్లేందుకే అనుమతి

- డిశెంబర్ 5 వరకు ఎన్నికల కోడ్ : కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 11, (మనం బ్యూరో): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 9న విడుదల అయినందున, అప్పటి నుండి డిసెంబర్ 5 వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్, నిబంధనలు అమల్లోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ ముగిసే వరకు రూ. 50 వేల వరకే నగదు తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకొని వెళ్లవద్దని ఆయన అన్నారు. ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే అట్టి మొత్తం సీజ్ చేసి, జిల్లా ట్రెజరీ అధికారుల వద్ద జమచేస్తారని ఆయన తెలిపారు. సరైన ఆధారాలను చూపిస్తే తిరిగి ఇచ్చేస్తారని, అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు నగదును తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో నగదును తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. అధికారులకు ఆధారాలుగా, నగదు డ్రా చేసిన అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం చీటి, వస్తువులు, ధాన్యం విక్రయం నగదు అయితే సంబంధిత బిల్లు, భూమి విక్రయించిన సొమ్ము అయితే డాక్యుమెంట్లు, వ్యాపారం, సేవల నగదు అయితే లావాదేవీల వివరాలు చూపించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై అప్పీలు, ఆధారాలు పొంది దరఖాస్తు చేసుకోవడానికి నూతన కలెక్టరేట్ మొదటి అంతస్థులోని జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారిణి ఏ. విజయ కుమారిని కాంటాక్ట్ నెం. 9492104983 సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పొంగులేటి అనుచరుల ఆత్మీయ సమావేశం



పాల్వంచ, అక్టోబర్ 11, (మనం న్యూస్): మాజీ ఎంపీ పొంగులేటి శ్రీని వాసరెడ్డి అభిమానుల, అనుచరుల ఆత్మీయ సమావేశం పాల్వంచ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వూకంటి గోపాల రావు మాట్లాడుతూ కార్యకర్తలు చేప ట్టాల్సిన కార్యక్రమాల గురించి దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తూము చౌదరి, తుమ్మల శివారెడ్డి, అయిత గంగాధర్, తాళ్ళూరి సత్యనారాయణ, తాళ్లూరి షణ్ముఖ చారి, ఆరుద్ర సత్యనా రాయణ, సమ్మెట వెంకట అప్పారావు, బట్టు లక్ష్మణ్ నాయక్, శశి, మద్దినేని నవీన్, శ్రీరాములు, బాధర్ల జోషి, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, నాగిరెడ్డి, జీవన్ రెడ్డి సోమా వెంకటరెడ్డి భీమిరెడ్డి లక్ష్మీ రెడ్డి, శ్రీలత రెడ్డి, పసుపులేటి ప్రభాకర్, ఇజ్జగాని రవిగౌడ్, పాత పాల్వంచ నవీన్, కృష్ణా మూర్తి, శివ, రేఖ అప్పారావు, ప్రసాద్, తదితర గ్రామల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పొంగులేటి శ్రీనన్న అభిమానులు పాల్గొన్నారు.

# పోలీసు, రెవెన్యూ అధికారులు కేసీఆర్‌కు తొత్తులు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్
- ఎన్నికల్లో డబ్బు,మద్యం ప్రభావాన్ని అరికట్టాలి
- బీసీలకు 60-70 అసెంబ్లీ సీట్లు కేటాయిస్తాం





భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 11, (మనం ప్రతినిధి): వచ్చే ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీకి తొత్తులుగా మారి వ్యవహారించే పోలీసు, రెవిన్యూ అధికారులపై త్వరలోనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలో పార్టీ నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో జరిగే అవినీతి అక్రమాలను అరికట్టడంలో పోలీసులు విఫలమైతే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసు ఇంటెలిజెన్స్ అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్ కు తొత్తులుగా మారారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మద్యం,డబ్బు పంపిణీపై ఎన్నికల సంఘం పకడ్బందీగా చర్యలు తీసుకొని అరికట్టాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే బీసీ,ఎస్సీ,ఎస్టీలకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్,బిజెపి పార్టీలు బీసీల ఓట్లు వేయించుకొని గద్దెనెక్కుతున్నారు కానీ, బీసీలకు అసెంబ్లీ సీట్లు కేటాయించడంలో వివక్ష చూపుతున్నాయన్నారు.

**బిసిలకు సముచిత స్థానం....**

రాబోయే ఎన్నికల్లో బీసీలకు 60-70 అసెంబ్లీ సీట్లు తమ పార్టీ కేటాయిస్తుందని అన్నారు.పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇసుక అక్రమ ర్యాంపులు, భూదందాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అధికార అహంతో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవ రౌడీయిజం, గూండాయిజం బెదిరింపులతో ఓ కుటుంబంలో నలుగురు ఆత్మహత్యకు కారకులయ్యారని అన్నారు. భద్రాచలం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.100 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు? భద్రాచలం రామయ్యను కన్నెత్తి చూడని తండ్రి కొడుకులు కేసీఆర్, కేటీఆర్ ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కిన్నెరసాని తాగునీటి పథకం పైపులైన్ల లీకేజీ మరమ్మతులకు కోట్లాది రూపాయలు నిధులు దుర్వినియోగం చేశారన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయం, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తానన్న ముఖ్యమంత్రి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేయుటకు ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదన్నారు. బొగ్గు రవాణా ద్వారా వందల కోట్ల ఆదాయం వస్తున్నా, కొత్త రైళ్లు ఏర్పాటు చేయకపోగా, ఉన్న రైలు మార్గాలను తొలగిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు మౌనం వహించి కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని విమర్శించారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మంది రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులందరిని పర్మనెంట్ చేస్తామన్నారు.బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ స్థాయిలో విద్యనందించి విదేశాల్లో చదివేలా ప్రత్యేక విద్యా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు.ప్రభుత్వ కాంట్రాక్టులన్నీ జనాభా నిష్పత్తి ప్రకారంపంచుతామన్నారు. కొత్తగూడెం పట్టణానికి మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవన్న ఆయన కిన్నెరసాని మురికి నీరు వస్తుందని విమర్శించారు.

**99 శాతం ఉన్న బహుజనులు రాజ్యమేలాలి....**

జనాభాలో 99 శాతం ఉన్న బహుజనులు రాజ్యమేలాలని, ఇప్పటికీ బహుజనులు భయం భయంగా జీవిస్తున్నారని, ఇది ఎంతమాత్రం సహించరాని విషయమని, 99 శాతం ఉన్న బహుజనులు వారి ఓట్లు వారికి వేసుకుని బహుజనులు రాజ్యాధికారం దక్కించుకోవాలని డాక్టర్ ఆర్ ఎస్. ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎక్కడ చూసినా బహుజనుల మీదనే అక్రమ కేసులను బనాయిస్తున్నారని, జిల్లాలో మగ్గిపోయేది కూడా ఎస్సీలు, ఎస్టీలు బీసీ లేనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనులు ఎన్నికల సమయంలో వచ్చే మందు డబ్బుకు ఆశ పడవద్దని, ఒక్క ఓటు కూడా విలువైనదేనని, బహుజనల బిడ్డలను అసెంబ్లీకి పంపి వడ్డించేవాడు మనవాళ్లు ఉండేటట్టు చూసుకోవాలని ఆర్ ఎస్. ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ర్యాలీ ఓల్డ్ బస్టాండ్ నుండి మొదలైన ర్యాలీ సూపర్ బజార్, ఆర్టీసీ కొత్త బస్టాండు మీదుగా కొత్తగూడం క్లబ్ వరకు కొనసాగింది.ఈ సంధర్భంగా ర్యాలీలో వేలాది మంది పార్టీ శ్రేణులు, భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి యెర్రా కామేష్, జిల్లా అధ్యక్షులు ఇర్పా రవికుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండి రమణి, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు, సాయి, సిర్ల.మణీసాయి, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేది ప్రజా ప్రభుత్వం

- తెలంగాణ తెచ్చుకుంది దోపిడీదారుల కోసం కాదు
- ఆరు గ్యారంటీ కార్డులతో ప్రజల్లోకి
- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు
- త్వరలోనే అభ్యర్థుల ప్రకటన
- సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం, అక్టోబర్ 11, (మనం బ్యూరో): రానున్నది ప్రజా ప్రభుత్వమేనని సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చుకుంది దొరలు. దోపిడీ దారుల కోసం కాదన్నారు. నాలుగున్నర కోట్ల ప్రజలుబాగు పడడానికి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. చింతకాని మండలం అనంతసాగర్ గ్రామంలోని మామిడితోటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. టిఆర్ఎస్ 10 సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రానికి కొత్తగా ఒక పరిశ్రమ, ఒక ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. సర్వీస్ సెక్టర్లో పని కొచ్చే వ్యవస్థలను తీసుకురావడంలో విఫలమైందన్నారు. పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి పేరిట ఐదు లక్షల కోట్ల రూపాయల అప్పు, పది సంవత్సరాల బడ్జెట్ టిఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మాటలు మాత్రం కోటలు దాటించే టిఆర్ఎస్ నాయకులు ఎన్నికలవేళ రాష్ట్రంలో పర్యటన చేస్తూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలారా వీరి పట్ల జాగ్రత్త ఉండాలని, ఓటు మన భవిష్యత్తుకు ఉపయోగపడేది. అభివృద్ధికి పునాదిగా ఉపయోగపడే మన ఓట్లను మోసగాళ్లకు, దోపిడిదారులకు వేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్కు వేయాలని విజ్ఞప్తి చేశారు. టిఆర్ఎస్ పార్టీ ఎక్స్‌పైరీ డ్రగ్గా మారి బిఆర్ఎస్‌గా రూపాంతరం చెందిందని, రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంలో ఉన్న బిజెపితో చేతులు కలిపి తెలంగాణలో బిజెపికి బీ టీంగా పని చేస్తోందని ఆరోపించారు. దీనికి ఎంఐఎం పార్టీ వంత పాడుతూ భజన చేస్తోందన్నారు. దేశ సంపదను అదాని, బహుళ జాతి కంపెనీలకు దోచిపెట్టి ప్రధాని మోడీకి ఉపయోగపడే విధంగా మారిన బిఆర్ఎస్‌కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టేనన్నారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ ఎంపీలకు ఓట్లు వేస్తే ఢిల్లీలో బిజెపి ఆధ్వర్యంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలకు మద్దతుగా ఓట్లు వేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల నమ్ముతున్న బిజెపికి మద్దతు ఇస్తున్న బిఆర్ఎస్‌కు ఓట్లు వేద్దామా? అని ప్రశ్నించారు. తెలంగాణకు సిరుల బంగారం కురిపిస్తున్న సింగరేణి కాలరీస్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేస్తూ సంపదలను దోచుకుంటున్నాయని, హైదరాబాద్ చుట్టూ ఉన్న విలువైన భూములను టిఆర్ఎస్ ప్రభుత్వం అప్పనంగా అమ్మేస్తోందని ఆరోపించారు. ధరణిని తీసుకువచ్చి ప్రభుత్వ భూములను తన బినామీల పేరిట నమోదు చేస్తున్నారని, రాష్ట్రానికి ఆదాయం తీసుకొస్తున్న హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లాంటి రాష్ట్ర ఆస్తులను బిఆర్ఎస్ ప్రభుత్వం పనికిమాలిన సంస్థలకు లీజికి ఇచ్చి రాబోయే 30 సంవత్సరాల ఆదాయాన్ని దోపిడీ చేస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దళిత గిరిజనులకు చెందకుండా పక్కదోవ పట్టిస్తున్నారని, రాష్ట్రంలో 50% ఉన్న బీసీలకు బీసీ బందు పేరిట తూతూ మంత్రంగా నిధులు ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వడం ఇష్టంలేని టిఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తూ మూడు లక్షలు రూపాయలు గృహలక్ష్మి పేరిట ఇచ్చారని, అవి ఎన్నికల ముందు ఇవ్వడంతో ఇండ్ల నిర్మాణానికి ఏమాత్రం పనికి రాకుండా పోయాయని అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సందర్భంగా ప్రజలందరూ ఈ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్న దోపిడిదారులను తరిమికొడతామని చెప్పారని, జరగబోయే ఎన్నికల్లో ప్రజలు దోపిడిదారులను తరిమికొట్టే విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తొలుత పార్టీ బూత్ లెవల్ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.

## మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని తనిఖీ చేసిన వైద్యాధికారి



అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 11, (మనం న్యూస్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రగుంట వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, మండలంలో విస్తృతంగా పర్యటించి మిషన్ ఇంద్రధనస్సు (మిగిలిపోయిన చిన్నపిల్లలకు టీకాలు వేయడం) కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. అనంతరం చిన్నపిల్లలకు టీకాలు వేసుకున్నారా ? లేదా ?అని అబ్జర్వేషన్ చేశారు. డాక్టర్ తన్నాయ, ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మిషన్ ఇంద్రధనస్సు ను పరిశీలించారు. అదేవిధంగా అన్నపురెడ్డిపల్లిలోనే కేజీబీవీ బాలికల పాఠశాలను టీ టీ డబల్యు, ఆర్జెసి బాలికల పాఠశాలలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పిల్లలకు పరీక్షలు చేసి మందులు పంపిణి చేశారు. తరువాత పిల్లలను ఆరోగ్య విద్యపై పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పీహెచ్‌ఓ. పుల్లమ్మ పి హెచ్ ఎం. రాణి, హెచ్ ఈ ఓపి. కృష్ణయ్య, డిపిఎమ్ఓ వెంకటేశ్వరరావు, హెచ్ వి.సారా రాణి, ఎంసిహెచ్‌పి. సోనియా, ఎంపిహెచ్ఓ కోటేశ్వరరావు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక ప్రకారం ఎన్నికల ప్రచారం నిర్వహించాలి

- గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మణుగూరు, అక్టోబర్ 11, (మనం న్యూస్) : మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని పద్మశాలి భవన్ నందు బిఆర్ఎస్ పార్టీ పట్టణ ముఖ్య కార్యకర్తలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా. కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైందని ఎన్నికలకు ఇంకా 46 రోజులు మాత్రమే సమయం ఉన్నదని, ఈ లోపు బూత్ ఇంచార్జిలు 100 ఓటర్లు ఇంచార్జ్ నిర్లక్ష్యం వహించకుండా కష్టపడి పని చేసి బిఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిపొందిన వారే ఉన్నారని సంక్షేమ పథకాల జాబితాలతో ప్రచారం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ గెలుపునకు ఏ శక్తి ఆపలేదని ఆయన అన్నారు. పినపాక నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని మళ్లీ గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామన్నారు. ప్రజల ఆశీర్వాదం సమిష్టి కృషితో గెలుపు సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపగడపకు వివరించాలని నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశంచేశారు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు, సీఎం కేసీఆర్ పాలన మరోసారి కావాలని ప్రజలు కోరుకుంటున్నారనితెలిపారు.

# తెల్లం వెంకట్రావు గెలుపు ఖాయం

- మూడో సారీ బిఆర్ఎస్ దే అధికారం
- ఎంపీ కవిత, ఎంఎల్సీ తాతా మధు
- ముఖ్య కార్యకర్తల సమావేశానికి బాలసాని డుమ్మా



భద్రాచలం, అక్టోబర్ 11, (మనం న్యూస్): భద్రాచలంలో వెంకట్రావ్ గెలుపు ఖాయమని, మూడోసారీ బిఆర్ఎస్‌దే అధికారమని ఎంపీ కవిత, ఎంఎల్సి తాతా మధు పేర్కొన్నారు. భద్రాచలం మండలం ముఖ్య కార్యకర్తల సమావేశం కేకే పంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ, భద్రాచలం ఎన్నికల ఇంచార్జి తాత మధుసూదన్, భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి మాలోతు కవిత మాట్లాడుతూ భద్రాచలంలో ఈ సారి తెలంగాణ జెండా ఎగరవేయాలని డా. వెంకట్రావుని అసెంబ్లీ కి పంపించి కెసిఆర్ మన్ననలు పొందాలని అన్నారు. తాతా మధు మాట్లాడుతూ ఈ సారి కెసిఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని అన్నారు. భద్రాచలం అభివృద్ధి అనేది మీ చేతులలో ఉందని, ఎటువంటి అపోహాలకు తావివ్వకుండా డాక్టర్ తెల్లం వెంకట్రావుని గెలిపించుకుంటే భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే భద్రాచలం పట్టణానికి సంబందించిన వివిధ పార్టీలకు సంబంధించిన సుమారు 100 కుటుంబాలు పైన బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి కెసిఆర్ చేసే అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరారు. వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని, మండల సీనియర్ నాయకులు,ఉద్యమ నాయకులు సిద్దులు,మండల అధ్యక్షకార్యదర్శులు అరికెల తిరుపతి రావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, మండల నాయకులు మహిళా నాయకురాలు గంగా భవాని,నాయకులు తాండ్ర రమణారావు, బొల్లి శెట్టి రంగారావు, మండల ఉపాధ్యక్షులు రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు, ఎండీ నవాబ్, యూత్, మహిళా, కార్మిక, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాలసాని డుమ్మా- మనం కథనంపై తీవ్ర చర్చ**

భద్రాచలం పట్టణంలో బుధవారం జరిగిన బిఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ డుమ్మా కొట్టినట్లు తెలిసింది. బుధవారం నాడు మనం దినపత్రికల్లో కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ బాలసాని అనే కథనం సంచలనం రేపింది. నాయకులు, కార్యకర్తల్లో అనేక సందేహాలు, అనుమానాలను రేకెత్తించింది. బుధవారం జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి బాలసాని వస్తారా ...!రారా... అనే సందిగ్ధం అందరిలోనూ కనిపించింది. ఆ సమావేశానికి బాలసాని రాకపోవటంతో మనం దినపత్రికలో వచ్చిన కథనంపై నాయకులు, కార్యకర్తలు చర్చించుకున్నట్లు తెలిసింది. బాలసాని లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఈ సమావేశం ద్వారా స్పష్టం చేస్తుందని, మనం దినపత్రికలో వచ్చిన కథనం వాస్తవమని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

# సాలూరా చెక్‌పోస్టును తనిఖీ చేసిన సిపి, కలెక్టర్

బోధన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దున నిజామాబాద్ జిల్లా సాలురా వద్ద కొనసాగుతున్న ఉమ్మడి తనిఖీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ బుధవారం తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న తీరును గమనించారు. విధుల్లో ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా నాలుగు చోట్ల అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సాలూర, కందకుర్తి, ఖండ్గాం, పోతంగల్ వద్ద ఉమ్మడి చెక్ పోస్టులు, మరో ఆరు ప్రాంతాల్లో అంతర్ జిల్లా చెక్ పోస్ట్ లు నెలకొల్పడం జరిగిందన్నారు. ఎన్నికలు ముగిసేంతవరకు పై చెక్ పోస్టులలో నిరంతరం 24



గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. పోలీస్,రెవెన్యూ, ఫారెస్ట్, రవాణా, వాణిజ్య పన్నులు,ఎక్సైజ్ తదితర శాఖలు ఉమ్మడిగా తనిఖీలు జరుపుతాయన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని, అక్రమ మద్యం, నగదు వంటి వాటిని గుర్తించి సీజ్ చేస్తారని చెప్పారు.అయితే తనిఖీల వల్ల సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు ఎవరైనా నగదును వెంటబెట్టుకొని ప్రయాణాలు చేయాల్సి వస్తే సరైన ఆధారాలు కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.ఆధారాలు లేనట్లయితే నగదు జప్తు చేస్తారని అన్నారు.ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు ఎన్నికల ప్రవర్తన నియమావళి తూచా తప్పకుండా అమలయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్, ఏ.సీ.పీ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బెల్ట్ షాపులపై కేసు నమోదు



ఇల్లంతకుంట, అక్టోబర్ 11, (మనం న్యూస్): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు బెల్ట్ షాపుల పైన కేసు నమోదు చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలోని రెండు కిరాణా షాపులలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారని సమాచారం మేరకు నిన్న రాత్రి పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని మద్యాన్ని అమ్ముతున్న మొగిలోజు. దయాసాగర్ షాపులో నుండి 15 బీర్ బాటిళ్లు, మూడు లీటర్ల మద్యం సీజ్ చేసి అతనిపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన బొడిగె.హరీష్ అనే వ్యక్తి వద్ద నుండి 38 బీరు బాటిళ్లు, 6.48 లీటర్ల మద్యం ను సీజ్ చేసి అతనిపై కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఎవరైనా మద్యాన్ని విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వైన్ షాపులు కాకుండా బయట ఎక్కడైనా మద్యాన్ని అక్రమంగా విక్రయించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, అటువంటి వారి సమాచారాన్ని పోలీసువారికి అందించాలని కోరారు. అక్రమంగా మద్యాన్ని విక్రయించిన దయాసాగర్, హరీష్‌లను బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## బిఆర్ఎస్ మండల యువజన విభాగం కన్వీనర్‌గా సందీప్ రెడ్డి



చిగురుమామిడి, అక్టోబర్ 11, (మనం న్యూస్): బిఆర్ఎస్ యువజన విభాగం మండల కన్వీనర్‌గా రేకొండ గ్రామానికి చెందిన తాటికొండ సందీప్ రెడ్డి ని నియమిస్తున్నట్టు హుస్నాబాద్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కామిరెడ్డి క్రాంతి తెలిపారు. ఈ మేరకు మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మామిడి అంజయ్య బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు. అలాగే తనకు సహకరించిన ఏడు మండలాల యువజన విభాగం అధ్యక్షులకు, తనమీద నమ్మకంతో బాధ్యతను అప్పజెప్పిన హుస్నాబాద్ యువజన అధ్యక్షులు క్రాంతిరెడ్డి కి, మండల పార్టీ అధ్యక్షులు మామిడి అంజయ్యకు, ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డికి, శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## విస్డమ్ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్): జిల్లాలోని రాయికల్ పట్టణంలోనీ విస్‌డమ్ హై స్కూల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా నిర్మ్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ బోగ శ్రావణి పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయిని, చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆట పాటలతో ఆహుతులను అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబార్ కళావతి, జగిత్యాల రూరల్ మండల మహిళ మోర్చా అధ్యక్షురాలు పత్తి రామేశ్వరి, మల్లేశ్వరి, రాయికల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సామల్ల సతీష్, నరేష్ మరియు విస్డం హై స్కూల్ యాజమాన్యం, చిన్నారులు పాల్గొన్నారు.

## కెసిఆర్ శకం ముగియబోతోంది.. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కాంగ్రెస్ తోనే ఉద్యమ ఆకాంక్షలు సాకారం
- సంక్షేమ పథకాల అమలులో బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్): దశాబ్ద కాలం అనంతరం కెసిఆర్ శకం ముగియబోతుంది, బీఆర్ఎస్ కథ ముగిసిందని ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల సందర్భంగా రెండు సార్లు ఆ పార్టీ మెనిఫెస్టోలో ప్రకటించిన వాటిని అమలుచేయలేదన్నారు. ఎన్నికల ప్రక్రియ వెలువడేంత వరకు దళితబంధు, బీసీ బంధు. మైనార్టీ బంధు, గృహలక్ష్మి అంటూ హడావిడి చేశారని, ఇప్పుడు ఎన్నికల సాకు చూపి తప్పించుకున్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో ప్రాధాన్యత అంశంగా నిరుపేదవర్గాలకు ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగే ప్రక్రియ అని జీవన్ రెడ్డి అన్నారు. తెలుగు దేశం పాలనలో కూడా నియోజకవర్గానికి 1000 ఇళ్ల నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. 2004లో ముఖ్యమంత్రి వైఎస్సార్ పాలనలో ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా కేవలం అర్హత ప్రాతిపదికన నిరుపేదలకు ఇల్లు కేటాయించినట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల పట్టణంలోని ఇల్లులేని నిరుపేదలకు నాలుగువేల ఇళ్ల ప్రతి లబ్ధిదారుడికి 100 గజాల స్థలంతో ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు, 2008లో స్థలాన్ని సేకరించి,4 వేల మందికి ఇల్లు కేటాయించి స్వంత స్థలం ఇచ్చి, నిరుపేదల్లో ఆత్మవిశ్వాసం కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఉద్యమ నాయకుడిగా సీఎం కేసీఆర్‌కు రెండుసార్లు అవకాశం ఇస్తే, ఉద్యమ ఆకాంక్షలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతాంగం, రైతు కూలీలు, దళితులు, బలహీన వర్గాలు, మైనార్టీలు, ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చడం కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఈ సమేవేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగభూషణం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్,బండ శంకర్, దుర్గయ్య, చాంద్ పాషా, తదితర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడాలి

- కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ సుగుణాకర్ రావు




కరీంనగర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): భారతదేశ జనాభాలో ఇప్పటికి 70శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో జీవనం కొనసాగిస్తున్నారని, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందనిదే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందదని అందుకే ప్రభుత్వాలు గ్రామ ఆర్థిక అభివృద్ధికి పాటుపడాలని కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ పొల్సాని సుగుణాకర్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బుధవారం మూడవరోజు జరిగిన కిసాన్ గ్రామీణ మేళాలో అధిక సంఖ్యలో గొర్రె పెంపకం దారులు, మత్స్యకారులు, మహిళా సంఘాలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణాకర్‌రావు మాట్లాడుతూ కేవలం పంటలు పండించడం వరకే పరిమితం కాకుండా రైతులు తమ భూములలో చేపలు పెంపకం డైరీ గొర్రెల పెంపకపై దృష్టి పెడితే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. మహిళా సంఘాలు కేవలం డబ్బు వడ్డీకిచ్చి తమ సంఘాలను నడుపుతున్నారని వారు వస్తు ఉత్పత్తిదారులుగా మార్చే ప్రయత్నం చేయాలని వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం ప్రభుత్వం కలుగజేయాలని తెలిపారు. ఈ మేళా ద్వారా తమ మహిళా సంఘం ఉత్పత్తులు కొనుగోలుదారులతో అనుసంధానం చేయనున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పథకాలలో భాగంగా గొర్రెల పెంపకం దారులు వివిధ పథకాలు అమలు చేయనున్నామని చెప్పారు. మత్స్యకారులకు మత్స సంపాదన యోజన పథకం ద్వారా లాభం చేకూర్చనున్నామన్నారు. మత్స్యకారులకు సైకిల్ మోటార్ పథకం కేంద్ర ప్రభుత్వం తనవంతు వాటా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేని కారణంగా మత్స్యకారులు లబ్ధి పొందలేకపోయినారని తెలిపారు. రాష్ట్ర ప్ర భుత్వం గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధి చేయకుండా తాయిలాలతో అధి కారంలోకి రావాలని ఆశించుట దురదృష్టం అని తెలిపారు. జాతీయ రొయ్యల రైతు అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ చేపల రైతు అధ్యక్షులు మోహన్ రాజు మాట్లాడుతూ 1980 దశకంలో గోదావరి జిల్లాలో ఎక్కువగా వరి పంట పండించే వారని ఇప్పుడు అక్కడ వరి పంటకు బదులుగా చేపల చెరువులు ఏర్పడ్డాయని కరీంనగర్ జిల్లాలో కొద్ది సంవత్సరాలలో వరి పొలాలు చేపల చెరువులుగా మారనున్నాయని తద్వారా రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. కేవలం వరి పంటపైన ఆధార పడడం బదులు చేపల పెంపకం డైరీల ద్వారా రైతులకు ఎక్కువ ఆదాయం ఉంటుందని చెప్పారు. ఉత్తమ రైతు జాతీయ హార్టీ కల్చర్ డైరెక్టర్ సత్య కృష్ణంరాజు మాట్లాడుతూ కరీంనగర్ రైతులకు పామాయిల్ తోటల పెంపకం వలన అధిక లాభాలు పొందనున్నారని సాధారణ పంటల కంటే పామాయిల్ తోటల వలన రెట్టింపు లాభం వస్తుందని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గొర్రె పెంపకం పథకంతో రైతులకు ఎంతో లాభం చేకూర్చుతుందని దానిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వెటర్నరీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పరుశరాములు మాట్లాడుతూ పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. రిటైర్డ్ జెడిఎ జనార్ధన్ రావు భూ పరీరక్షకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కొండపలకల ఉత్తమ రైతు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు భయపడ కూడదని ధైర్యంతో ముందుకు వెళ్లినప్పుడే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కెవికె జమ్మికుంట శాస్త్రవేత్త ప్రభాకర్ మాట్లాడు తూ మన జిల్లాలో నీటి లభ్యత ఉన్న కారణంగా రైతులు చేపల పెంపకం పై దృష్టి పెట్టాలని కొన్ని భూములలో వరి పండే అవకాశం లేకుండా పోయిందని కావున చేపల పెంపకంలోకి మారాలని అందులో చేప పిల్లల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఉక్కు అధ్యక్షులు శంకరయ్య, పురుషోత్తం రెడ్డి, కమలాకర్ రావు, వెంకట్ రెడ్డి, సుధాకర్, పురు షోత్తమరావు, బాపురెడ్డి, నరసింహారెడ్డిలు మాట్లాడుతూ ఉక్కు వలన రైతు లకు ఎంతో లాభం జరగనున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్నబోయిన ఓదెలు, ఆడేపు రవీందర్, లింగంపల్లి శంకర్, కటకం సునీల్ రావు, ములుగూరి కిషోర్, గాజుల వేణు, పరశురాములు, స్వామి, ప్రదీప్ యాదవ్, సున్నాకుల శ్రీనివాస్, లక్ష్మణ్, మల్లేశం యాదవ్, సంజీవరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలి



జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్): రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరుగకుండా ప్రజలంతా సహకరించాలని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 927 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో నార్మల్ పోలింగ్ కేంద్రాలు 679 క్రిటికల్ పోలింగ్ 248గా గుర్తించిటన్లు తెలిపారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. గ్రామంలోని ప్రజలంతా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామం, జిల్లా అభివృద్ధి చెందుతుందని కావున ప్రజలంతా వర్గ బేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని, కలిసి మెలిసి సామరస్యంగా ఉండాలని తెలిపారు. ప్రజలంతా పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రవీంద్ర కుమార్, మెట్ పల్లి సీఐ లక్ష్మి నారాయణ, ఎస్ఐలు చిరంజీవి, ఉమసాగర్, నవీన పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



కరీంనగర్, అక్టోబర్ 11, (మనం న్యూస్): స్థానిక పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సంప్రదాయక దుస్తులు ధరించి, సృజనాత్మక నైపుణ్యంతో వివిధ రకాల పూలతో పోటా పోటీగా బతుకమ్మలను పేర్చి అలంకరించారు. విద్యార్థుల తల్లులకు బతుకమ్మలను పేర్చే విధానం, బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థినులు వారి తల్లులు ఉపాధ్యాయినులు, కోలటాలతో, నృత్యాలతో పాటలతో పలువురిని అలరించారు. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల తల్లిదండ్రులకు ముందస్తు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, వినోదరావు, వి. యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాద్యాయులు రితేష్ మెహత, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీ మారేవాళ్లు ముందుగా పదవులకు రాజీనామా చేయాలి

- బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్



బోధన్ అక్టోబర్ 11, (మనం న్యూస్): ఎమ్మెల్యే షకీల్ దయతో పదవులుపొంది, నేడు ఎమ్మెల్యేకే వెన్నుపోటు పొడవాలని చూస్తున్న కొంతమంది నాయకులు ముందుగా తమతమ పదవులకు రాజీనామా చేసిన తర్వాతే ఇతర పార్టీలోకి వెళ్లాలని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణ బిఅర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసిన మూడోసారి విజేతగా నిలిచేది ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. బిఅర్ఎస్ పార్టీ ఒక మహా సముద్రం లాంటిదని, ఒకరిద్దరు నాయకులు పార్టీలు మారినంత మాత్రాన పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్లు దూప్ సింగ్, అశ్వాక్, సత్యం, తోకల గంగారెడ్డి, పొల్, అబ్దుల్లా, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు శంకర్ గౌడ్, కార్మిక విభాగం అధ్యక్షులు రవి శంకర్ గౌడ్, యువ నాయకులు జేపీసీ శంకర్, సిరివెను సంతోష్, మొహమ్మద్ షేక్, బోదు శంకర్, ఆసిం,సాగర్, శ్రీనివాస్, మహేందర్, జాకిర్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.


## విజయ్ మేరీ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



బోధన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా బోధన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సామాగ్రి సేకరణ, పంపిణీ కోసం ఎంపిక చేసిన బోధన్‌లోని విజయ్ మేరీ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సిపి. సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. పాఠశాలలోని గదులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లకు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇదివరకు 2018లో జరిగిన ఎన్నికలకు సంబంధించి కూడా ఇదే కేంద్రాన్ని వినియోగించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్, ఏ.సీ.పీ. కిరణ్ కుమార్, తహసీల్దార్ గంగాధర్, పట్టణ సిఐ. ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.


## ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల అర్బన్, అక్టోబర్ 11, (మనం న్యూస్) :అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అప్రమత్తంగా ఉంటూ మోడల్ కోడ్ ఉల్లంఘనలపై స్పందించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అను రాగ్ జయంతి సూచించారు. బుధవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను నిక్కచ్చిగా అమలు పై ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులతో కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ నందు సమావేశం నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిష్పక్షపాతంగా, పారదర్శంగా ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. మోడల్‌కోడ్ ఉల్లంఘన సమయంలో సీజ్ చేసేటప్పుడు ఖచ్చితంగా పంచనామా చేయాలన్నారు. ఆ ప్రక్రియను వీడియోగ్రఫీ కూడా చేయాలన్నారు. సి విజిల్ సహా ఇతర ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్, చేనేత జౌళి జిల్లా అధికారి సాగర్, జిల్లా లేబర్ అధికారి రఫీ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎస్పీ




ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 11, (మనం న్యూస్): ఎన్నికల నేపధ్యంలో జిల్లా సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని బుధవారం జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలవడడంతో ఎన్నికల కోడ్ అమలవుతుందని, ప్రజలను ప్రలోభ పెట్టే రూపాయలు గాని, మద్యం సరఫరా కాని జరగకుండా ఆరికట్టేందుకే ఈ తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

## మంథనిలో మహిళా దారుణ హత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



మంథని, అక్టోబర్ 11, (మనం న్యూస్) : మంథని మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బందెల రాజామణి(37) అనే వివాహిత హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే రాజమణి భర్త గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోవడంతో ఆమె రేషన్ డీలర్గా కొనసాగుతుంది.కొంతకాలంగా పైడాకుల సంతోష్ అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడడంతో ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్న సంతోష కొన్ని రోజులుగా ఆమెను వదిలించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా సోమవారం రాత్రి రాజమణి గొంతు కోసం హతమార్చిన సంతోష్ గడికి తలుపులు పెట్టి పారిపోయాడు.రెండు రోజులుగా ఆమె ఫోను లిఫ్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె కొడుకు మంగళవారం రాత్రి గతి తలుపులు తీయగా ఆమె హత్యకు గురైనట్లు తెలిసింది. ఆమె సోదరుడు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలకు ఇద్దరు కొడుకులు ఒక కూతురు ఉన్నట్లు తెలిసింది.

## బైండోవర్ల పేరుతో భయబ్రాంతులకు గురి చేస్తున్నారు

- డిసిసి అధ్యక్షులు రాజ్ ఠాకూర్



గోదావరిఖని, అక్టోబర్ 11, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేని అధికార పార్టీ నాయకులు బైండోవర్ల పేరుతో భయబ్రాంతులకు గురి చేస్తున్నారని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టి డిసిసి అధ్యక్షులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. బుధవారం ప్రజా దీవెన యాత్ర ఆరవ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే రామగుండం నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా పరిపాలన రామగుండంలో కొనసాగుతుందని, చట్టంలో ఎక్కడాలేని కొత్త కొత్త విధులు, విధానాలు ఇక్కడ పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. రామగుండంలో జరుగుతున్న అక్రమ బైండోవర్లను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్, ఎలక్షన్ కమిషన్కి రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు.

## సమస్యలు పరిష్కరించాలని హాస్పిటల్ సానిటేషన్ కార్మికుల వినతిపత్రం



సిరిసిల్ల అర్బన్, అక్టోబర్ 11, (మనం న్యూస్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సానిటేషన్ కార్మికుల హాస్పిటల్ ప్రిన్సిపల్కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ముశం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో 230 పడుకలున్నప్పటికీ ప్రభుత్వం 75 పడకల ఆస్పత్రిగా పరిగణించి 44 మంది సానిటేషన్ కార్మికులను పనిచేయడానికి మాత్రమే జీవో జారీ చేసిందన్నారు. దీంతో కార్మికులకు తీవ్ర పనిభారం పడుతోందని తెలిపారు. అధిక పనిభారం వల్ల కార్మికలు అనారోగ్యానికి గురికావలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఎలాంటి సెలవులు ఇవ్వకుండా కార్మికులతో పని చేయిస్తుండడంతో మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వెంటనే 230 పడకలకు సరిపడే కార్మికులను నియమించాలని లేనిపక్షంలో కార్మికులందరూ పనిమానేసి సమ్మెకు వెళ్తారని హెచ్చరించారు.

## ప్రభుత్వ కాలేజీలో మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



మెట్పల్లి, అక్టోబర్ 11, (మనం న్యూస్) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి కే. వేంకయ్యల ఆధ్వర్యంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మొక్కలను నాటారు. అనంతరం మొక్కల సంరక్షణ కోసం కట్టెలను అమర్చి, వాటి చుట్టు ప్లాస్టిక్ జాలీలను అమర్చారు. అనంతరం ఆ చెట్లకు నీళ్ల పోసి, పరిశుభ్రంగా ఉంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ, నాటిన మొక్కలను సంరక్షించవలసిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని అన్నారు. నాటిన మొక్కలను ప్రతీ ఒక్క విద్యార్థి,తమ చెట్టులాగా భావించాలని, అదే విధంగా ఆ చెట్టును సంరక్షించే బాధ్యతను ఒక్కొక్క విద్యార్థి తీసుకోవాలని స్థానిక ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే.వేంకయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల సహాయ ఆచార్యులు రాజేందర్, లెక్చరర్లు గట్టయ్య, అంజయ్య, గణేష్లతోపాటు బోధనేతర సిబ్బంది బాబు, లక్ష్మీనర్సయ్య, భూలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చందన, సాయిబాబా, సిద్దూ, మధుర వాణి, రవీనా పాల్గొన్నారు.

# జనాలకు దరి చేరని 'జనరిక్'

- రోగం ఒక్కటే, మందు ఒక్కటే
- పనిచేసే విధానం ఒక్కటే కానీ ధరల్లో మాత్రం భారీ వ్యత్యాసం
- చాలా మంది బ్రాండెడ్ మందులకే మొగ్గు చూపుతున్నా తీరూ..?






సుల్తానాబాద్, అక్టోబర్ 11, (మనం న్యూస్) : రోగం ఒక్కటే. మందు ఒక్కటే. పనిచేసే విధానం ఒక్కటే. కానీ, ధరల్లో మాత్రం భారీ వ్యత్యాసం. అయినా, చాలా మంది బ్రాండెడ్ మందులకే మొగ్గు చూపుతున్నారు. ప్రజల అవగాహనా రాహిత్యం, వైద్యుల ప్రోత్సాహం. వెరసి చవకగా లభించే జనరిక్ మందులకు చెప్పుకోదగ్గ ఆదరణ లబించడం లేదు. స్థోమత లేని వాళ్లు కూడా ఖరీదైన మందులపై లక్షల రూపాయలు జనరిక్ మందులకు చెప్పుకోదగ్గ ఆదరణ లభించడం లేదు. స్థోమత లేనివాళ్లు కూడా ఖరీదైన మందులపై లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. బ్రాండెడ్, జనరిక్ మందుల మధ్య వ్యత్యాసం, పనితీరులో తేడాలు, నిరాదరణకు కారణాలు సామాన్యుడికి అతి తక్కువ ధరకు ఔషధాలను అందించడమే 'జనరిక్ మెడిసిన్' లక్ష్యం. జనరిక్ మందులను భారత్, చైనా తదితర దేశాల్లో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని మూడు రకాలుగా విభజించవచ్చు. ఒకటి. జనరిక్(జనరిక్ మాత్రమే), వీటికి బ్రాండ్ పేరుండదు. ఇవి ప్రధానంగా ప్రభుత్వ దవాఖానలు, వైద్యసంస్థలలో మాత్రమే దొరుకుతాయి. రెండు. ట్రేడ్ జనరిక్. వీటిని ట్రేడ్ ఫార్మసిస్టులు పంపిణీ చేస్తారు. వీటికి పరిశోధన, నాణ్యత లాంటి ప్రమాణాలేం ఉండవు. మూడు. బ్రాండెడ్ జనరిక్. ఈ కోవలోకి వచ్చే వాటికి మాత్రం బ్రాండ్ పేరు ఉంటుంది. ఇవి ఔషధ పరిశ్రమలలో తయారవుతాయి. సేల్స్ రిప్రజెంటేటివ్స్ ద్వారా భారీ ప్రచారం కల్పిస్తారు. అందువల్ల ఖరీదు కూడా ఎక్కువే. పారాసిటమోల్ అనే మందు క్రోసిన్ లేదా కాల్పాల్ పేరిట మార్కెట్లో లభిస్తుందని మనకు తెలిసిందే. ఈ బ్రాండెడ్ మందుపై పారిసిటమోల్ అనే అసలు సిసలు రసాయనికి నామం మాత్రం చిన్నక్షరాలతో కనిపిస్తుంది. మందు తయారీ కంపెనీలు బల్క్ డ్రగ్స్ తయారు చేస్తు,వీటిని సరైన రూపంలో అందివ్వడానికి ఫార్ములేషన్ కంపెనీలు ఉంటాయి. బల్క్డ్రగ్కి ఈ కంపెనీలు రంగు, రూపం ఇచ్చి మాత్రలు, సిరప్, ఇంజక్షన్స్ రూపంగా తయారు చేస్తాయి. మనిషి ర క్తంలోకి ప్రవేశించి, రోగాన్ని నయం చేసేందుకు ఉద్దేశించిన రసాయనమే అసలు సిసలు మందు. ఈ పదార్థం బ్రాండెడ్లో అయినా, జనరిక్లో అయినా ఒకటే.

**ఎలాంటి తేడా ఉండదు**

జనరిక్ మందులు నాణ్యమైనవేనా..? అన్నది సామాన్యుడి అనుమానం. జనరిక్ అయినా బ్రాండెడ్ అయినా తయారీ నాణ్యత, పనితీరు ఒకే విధంగా ఉంటాయి. కాల పరిమితి ముగియడంతో, మొదటి ఉత్పత్తి దారుడు పేటెంట్ అధికారం కోల్పోయిన తర్వాత, ఇతరులు ఈ మందును తయారు చేసుకుంటారు కాబట్టి, తక్కువ ధరకే అమ్మగలుగుతారు. తయారీలోనూ, మార్కెటింగ్లోనూ అదనపు ఖర్చు ఉండదు కాబట్టే, ఇది సాధ్యపడుతుంది.

**ఎందుకు ఇంత ఖరీదు..?**

ఒక మందును మార్కెట్లో విడుదల చేయడం అన్నది ఓ పెద్ద పని, కొత్త ఔషధాన్ని కనిపెట్టాలంటే లోతైన ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. అందుకు నిపుణులైన శాస్త్రవేత్తలు కావాలి. అత్యాధునికి ల్యాబ్ అవసరం, వ్యయ ప్రయాసలను భరించి పరిశోధనలు చేసినా, కొన్ని సందర్భాల్లో సత్ఫలితాలు రావు. ఫార్ములా తయారైనా, ప్రయోగదశకు వచ్చేసరికి వికటిస్తాయి. మార్కెట్కు పంపక ముందే చేజేతులా ధ్వంసం చేయకతప్పని పరిస్థితి. అంతా అనుకున్నట్టే జరిగినా వందలకొద్దీ ఉద్యోగుల జీతభత్యాలు,వైద్యుల కమీషన్లు, పంపిణీ ఖర్చు, రవాణా ఇలా ప్రతి దశలోనూ వ్యయాలు ఉంటాయి. ఒక టాబ్లెట్ తయారు చేయటానికి ఐదు రూపాయలు అయిందంటే. దాని చుట్టూ అల్లుకున్న వలయాన్ని ఛేదించేసరికి ఖర్చు తడిసి మోపెడవుతుంది. దీనికి కంపెనీలను నిందించాల్సిన పనిలేదు. ఒక మందుల కంపెనీ ఏండ్ల తరబడి పరిశోధనలు చేసి, కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఒక కొత్త ఔషధాన్ని కనిపెడితే, ఆ మందుపై పేటెంట్ కాలపరిమితి 20 సంవత్సరాల వరకు మాత్రమే ఉంటుంది. కాలపరిమితి తీరిన వెంటనే ఫార్ములాను విడుదల చేయాల్సిందే. అంటే పరిశోధన, ప్రయోగాలు ఈ తతంగమేదీ లేకుండానే, అదే ఫార్ములాతో మిగతా కంపెనీలు కూడా మందులను ఉత్పత్తి చేసుకోవచ్చు. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్డియే) అనుమతి తీసుకుంటే సరిపోతుంది. ఆ తంతు పూర్తి కాగానే, రకరకాల పేర్లతో విడుదల చేసుకోవచ్చు

**ఆదరణ ఎందుకు లేదు..?**

తక్కువ ధరే అయినా, ప్రజలు జనరిక్ వైపు వెళ్లడం లేదు. వైద్యులు కూడా 'జనరిక్' మందులను సిఫార్సు చేయడ ం లేదు. ప్రజల మంద మనస్తత్వమే దీనికి ఒక కారణం. ఖరీదైన మందులు వాడితేనే రోగం నయమవుతుందన్న నమ్మకం ఒక వైపు, చౌకబారు మందులవల్ల సైడ్ ఎఫెక్స్ ఉంటాయన్న అపోహ మరోవైపు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఉదాహరణకు – బ్రాండెడ్ పారాసిటమాల్ మాత్రల స్ట్రిప్ ఖరీదు రూ. 20 రూపాయలు ఉంటే, జనరిక్ మందు ఖరీదు కేవలం రూ. 8 మాత్రమే. ధర విషయంలో ఇంత వ్యత్యాసం ఉండటంతో 'జనరిక్' మందులు పని చేయవేమోనన్న అపనమ్మకంతో అత్యధికులు బ్రాండెడ్ వైపు మొగ్గ చూపుతున్నారు. ఎటువంటి రోగమైనా క్షణాల్లో నయం కావాలి. రోగం తగ్గడానికి రోజులూ నెలలూ పట్టకూడదని అనుకునేవారే ఎక్కువ. ఈ ధోరణి మారాలి. వీటికి తోడు అల్లోపతికి మించింది లేదన్న ప్రగాఢమైన నమ్మకం నరనరాల్లోనూ జీర్ణించుకు పోవడం వల్ల కూడా జనరిక్ మందులపట్ల మొగ్గ చూపకపోవటానికి ప్రధాన కారణంగా నిలుస్తున్నది. ఇవన్నీ ఒక ఎత్తయితే. డాక్టర్లకూ ప్రముఖ మందుల ఉత్పత్తి కంపెనీలకూ మధ్య రహస్య 'అవగాహన' ఉండటంతో నాణ్యతను పక్కనబెట్టి,ఆయా ఉత్పత్తులను జనం నెత్తిన రుద్దుతున్నారు. 'జనరిక్' మందుల గురించిన ప్రచారం అంతంత మాత్రంగా ఉండటం వల్ల కూడా ఈ షాపులవైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. జనరిక్ ఔషద రూపంలో తక్కువ రేటుకు దొరుకుతుందనే విషయం చాలా మందికి తెలియదు. బ్రాండ్ మందులకు ఏమాత్రం తీసిపోని జనరిక్ మందులు అందుబాటులో ఉంటాయని అవగాహన ఉండదు. ఒక వేళ ఉన్నా. జనరిక్ మందుల్లో నాణ్యత ఉండదూ అపోహా కలిగించే వారు అధికం. దీనిపై ప్రజల్లోనూ సరైన అవగాహన లేదు. మరో విషయం ఏందంటే చదువుకున్న వారిలో సైతం జనరిక్ మందుల గురుంచి పూర్తి అవగాహన లేదు. ఇదిలా ఉంటే వైద్యులు మాత్రం తాము రాసే మందులను మాత్రమే వేసుకోవాలంటారు. వెరే మందులను కొనుగోలు చేస్తే వైద్యం చేయడానికి నిరాకరిస్తారు.ప్రజల్లో కూడా జనరిక్ మందులపై అపోహాలు ఉన్నాయి. జనరిక్ మందులనేని పనిచేయవని, నాణ్యత లేనివని, తగిన మోతాదులో మందు ఉండదని, తయారు చేసే విధానంలో సాంకేతిక నైపుణ్యం పాటించారని. అందువల్లే చౌక ధరలకు విక్రయిస్తున్నారని దుష్ప్రచారం సాగుతోంది. కొంత మంది ప్రభుత్వ వైద్యులు జనరిక్ మందులను రెఫర్ చేస్తున్నప్పటికి అవగాహనలేమితో ప్రజలు ఆ ఔషదాలను తిరస్కరిస్తున్నారు. ప్రజల్లో కూడా ఈ రకమైన అపోహాలు ఉన్నాయి. కానీ ఖరీదైన మందులు మాత్రం దొరకటం లేదు. జనరిక్ మందుల షాపులు కూడా నగరంలో చాలా తక్కువగా ఉన్నాయి. వీటి సంఖ్య కూడా పెరగాల్సి ఉంది. జనంలో ఈ జనరిక్ మందుల వినియోగంపై అవగాహనను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి, గతంలో ప్రధాని నరేంద్రమోడి వైద్యులు జనరిక్ మందులనే రాయాలి అని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది అమలు అయ్యే విధంగా గట్టి మార్గదర్శకాలను ప్రభుత్వాలే రూపొందిచాల్సిన అవసరం ఉంది.

## రామగుండం భవిష్యత్తు పెంచేలా మెడికల్ కళాశాల

- ఐటి,ఇండస్ట్రియల్ పార్క్ మాంజూరు కృషి
- వ్యాపారస్తులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా
- రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్



గోదావరిఖని, అక్టోబర్ 11, (మనం న్యూస్): రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి భవిష్యత్తు లేదని ఇక్కడ వ్యాపారుల నానుడి ఉండేదని, వైద్య కళాశాల ప్రారంభించి, ఐటి, ఇండస్ట్రియల్ పార్క్, సబ్ రిజిస్టర్ ఆఫీస్ మాంజూరు చేయించి రామగుండం భవిష్యత్తును పెంచామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రామగుండం కార్పోరేషన్ పరిధిలోని 50 వ డివిజన్లో లక్ష్మి నగర్ వ్యాపార వర్గాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరిఖని ప్రధాన వ్యాపార కేంద్రామైనా లక్ష్మి నగర్లో వన్ వే ఎర్పాటుతో వ్యాపారం జరగక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పోలీస్ అధికారులతో మాట్లాడి వన్ వే నిబంధనలు ఎత్తివేయించానని అన్నారు. అలాగే బంగారం షాపు యజమానులకు పోలీసుల నుండి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూశామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ప్రత్యేక రాష్ట్రంలో ఈ ప్రాంత వ్యాపారస్తులు ఉద్యమానికి సహకారం అందించారని అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో మూడు వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టి, ప్రతి డివిజన్లో సమస్యల పరిష్కారానికి కృషి చేశామని పేర్కొన్నారు. లక్ష్మి నగర్ వ్యాపారస్తులు సమస్యల పరిష్కారం కోసం పని చేశామని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, నాయకులు కౌశిక హరి, కార్పోరేటర్ గనముక్కల మహాలక్ష్మి తిరుపతి, కల్వచర్ల కృష్ణ వేణి భూమయ్య, బాలరాజ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు ఎండి రఫీ, వంగ శ్రీనివాస్ గౌడ్,నాయకులు తానిపర్తి గోపాలరావు, బాలసాని స్వామి గౌడ్, నడిపెల్లి సాగర్ రావు, బంక రామస్వామి, ముచ్చకుర్తి చంద్రమౌళి, తూముల అశోక్ రావు, ఎలప్ప, లక్ష్మినారాయణ చారి, రాజేందర్, ఆడెపు శంకర్, నంబయ్య, ముడుతనపల్లి సారయ్య, భాస్కర్ రెడ్డి, పోన్నం లక్ష్మన్, మేతుకు దేవరాజు, బంధె నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- అన్ని విధులుగా అభివృద్ధి చేసి చూపిస్తాం
- బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్రెడ్డి



మంథని, అక్టోబర్ 11, (మనం న్యూస్) : మంథని మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 100 మంది మహిళలు, యువత బుధవారం బిజేపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్రెడ్డి బిజేపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంథని ప్రాంతంలో అవినీతి అరాచక పాలన అంతం కావాలంటే ప్రజలందరూ కొత్త నాయకత్వాన్ని కోరుకోవాలని అన్నారు. 40 సంవత్సరాలు కాంగ్రెస్, 10 సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాలించినా పేద ప్రజలకు ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. మంథని ప్రాంతానికి ఒక హాస్పిటల్, ఇండస్ట్రీ, కళాశాల కల్పించలేక మంథని ప్రాంతాన్ని అంధకారం చేశారని అన్నారు. పక్కన ఉన్న రామగుండం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందనప్పుడు, ప్రధాని స్పీకర్, మంత్రి ఎన్నికైన మంథని ప్రాంతం ఎందుకు అభివృద్ధి చెందలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో జీవితాన్ని త్యాగం చేసి పాల్గొన్న నాకు టికెట్ ఇవ్వకుండా కెసిఆర్ ఉద్యమకారులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చెందే విధంగా ఉంటాయని ఒక్కసారి బిజెపి పార్టీకి ప్రజలు అవకాశం ఇస్తే మంథనిని అన్ని విధాలుగా మరింత అభివృద్ధి చేస్తామని బిజెపి నాయకులు సునీల్రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోతారవేణి క్రాంతికుమార్, మండల అధ్యక్షులు వీరబోయిన రాజేందర్, మండల ఇన్చార్జి తోట మధుకర్, మంథని పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు బొసెల్లి మౌనిక, బిజెపి పార్టీ మండల నాయకులు, సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ప్రచార రథాన్ని కానుకగా ఇచ్చిన కార్యకర్త



మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 11, (మనం న్యూస్) : బెల్లంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై అభిమానంతో పట్టణానికి చెందిన కార్యకర్త వీరబోయిన సందీప్ యాదవ్ ప్రచార రథంగా అంబాసిడర్ కార్ను బుధవారం కానుకగా అందించారు. వచ్చే ఎన్నికల్లో దుర్గం చిన్నయ్య భారీ మెజార్టీ తో గెలవాలని ఆకాంక్షిస్తూ పార్టీ గుర్తుగా కారును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ తన మీద ప్రేమతో తనను అభిమానించి తనపై నమ్మకంతో ప్రచార రథాన్ని అందచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గం ప్రజలు తన బలగం తన బంధువులన్నారు. ప్రజల ఆశీర్వాదాన్ని అందించిన తనకు ఓటు వేసి గెలిపించాలని చిన్నయ్య విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పథకాల అమలు

- కాంగ్రెస్ బిసి సెల్ మండల అధ్యక్షులు సంపత్



చిగురుమామిడి, అక్టోబర్ 11, (మనం న్యూస్): అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు పొన్నం సంపత్ కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ కార్డులతో బిసి సెల్ మండల అధ్యక్షుడు పొన్నం సంపత్ కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ కార్డులను ఓటర్లకు అందజేస్తూ వాటిని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసము, చేయూత పథకాలను వివరించారు. బిఆర్ఎస్ పార్టీ హామీలను, మోసాలను నమ్మవద్దని సంపత్ వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొజ్జ రాములు, భాషవేని కొమురయ్య, భాషవేణి పరశురాములు, భాషవేణి రాములు, పొన్నం రవీందర్, రాగుల మోహన్, జెట్టి కనకయ్య, తాడూరి శ్రీను, బోయిన శ్రీనివాస్, పొన్నం రాజేశ్వరి, హేమీమా, పొన్నం లక్ష్మి, గొల్ల లచ్చవ్వ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కదం తొక్కుతున్న కాంగ్రెస్



- మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు విజయరమణారావు

పెద్దపల్లి, అక్టోబర్ 11, (మనంప్రతినిధి) : బీఆర్ఎస్ప్రభుత్వాన్ని గద్దె దించి స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్రెడ్డి దుర్గార్గపు, నియంత పాలనకు చమరగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. బుధవారం ఓదెల మండలంలోని జీలకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కుండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్పార్టీ అధికారంలోకి రాగానే చేయూత పథకం ద్వారా రూ.4వేలు పిన్షన్ అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు మరింత బలపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్పార్టీ అభిమానులు, జీలకుంట గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్ఘన్‌పై టీం ఇండియా ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు



ఆఫ్ఘన్ విధించిన 273 పరుగుల విజయ లక్ష్యాన్ని 15 ఓవర్ల ముందే టీం ఇండియా చేదించింది. తొలుత లక్ష్య సాధన కోసం బరిలోకి దిగిన టీం ఇండియా ఓపెనర్లు రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడుతూ జట్టు స్కోర్ పెంచడానికి ప్రయత్నించారు. సారధి రోహిత్ శర్మ వీలు చిక్కినప్పుడల్లా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ స్కోర్ పెంచడంపై ద్రుష్టి పెట్టారు. 63 బంతుల్లోనే రోహిత్ శర్మ సెంచరీ పూర్తి చేసుకోగా, ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీకి మూడు పరుగుల దూరంలో ఔటయి పెవిలియన్ బాట పట్టాడు. టీంఇండియా, ఆఫ్ఘన్ మధ్య జరిగిన వరల్ కప్ మ్యాచ్‌లో టీం ఇండియా ముందు ఆఫ్ఘనిస్తాన్ 273 పరుగుల విజయలక్ష్యాన్ని నిలిపింది. తొలుత భారత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి.. పొదుపుగా పరుగులు ఇచ్చినా.. తర్వాతర్వాత ఆఫ్ఘన్ బ్యాట్స్ మన్లు వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు, స్టాండ్స్ వైపు మళ్లిస్తూ.. సింగిల్స్ తీస్తూ స్కోర్ పెంచడానికి ప్రయత్నించారు. ప్రత్యేకించి ఆఫ్ఘన్ సారధి హస్మతుల్లా షాహిద్.. అజ్మతుల్లా ఒమర్ జాయితో కలిసి నాలుగో వికెట్ భాగస్వామ్యానికి 100 పరుగులు జత చేశారు. 80 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔటైనా హజ్మతుల్లా షాహిద్ పర్వాలేదనిపించారు. మరో నాలుగు పరుగుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోవాల్సిన ఇషాన్ కిషాన్.. 19వ ఓవర్ లో రషీద్ ఖాన్ వేసిన నాలుగో బంతిని ఆడి ఇబ్రహీం జద్రాన్ కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో టీం ఇండియా తొలి వికెట్ కోల్పోయింది. తొలి వికెట్ భాగస్వామ్యానికి 156 పరుగులు జత చేశారు. ఔటయ్యే సమయానికి ఇషాన్ కిషన్ వ్యక్తిగత స్కోర్ 47.

## కుల్దీప్ యాదవ్ కళ్లు చెదిరే క్యాచ్.. పోలా అదిరిపోలా!



న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కళ్లు చెదిరే ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా అఫ్గానిస్థాన్తో జరుగుతున్న మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్.. సూపర్ క్యాచ్‌తో ఆకట్టుకున్నాడు. కుల్దీప్ యాదవ్ స్టన్నింగ్ క్యాచ్‌కు రషీద్ ఖాన్(16) నిరాశగా పెవిలియన్ చేరాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్గా మారింది. జస్ప్రీత్ బుమ్రా వేసిన 49వ ఓవర్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ తొలి బంతిని ఫ్ట్రైడ్ ఆఫ్ స్టంప్ దిశగా స్లోయర్గా వేయగా.. రషీద్ ఖాన్ ధాటిగా ఆడాడు. మిస్టెమ్ అయిన బంతి గాల్లోకి లేవగా.. స్వీపర్ కవర్లో ఫీల్డింగ్ చేస్తున్న కుల్దీప్ యాదవ్ అద్భుతంగా అందుకున్నాడు. తొలుత క్యాచ్ చేజారాగా.. రెండో ప్రయత్నంలో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. ఈ సూపర్ క్యాచ్‌కు రషీద్ వెనుదిరిగడంతో అఫ్గాన్.. 10-20 పరుగులు తక్కువ చేసింది. కుల్దీప్ యాదవ్ క్యా నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపి స్తున్నారు. ముందుగా బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ 8 వికెట్లకు 272 పరుగులే చేసింది. హష్మతుల్లా షాహిది(88 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సో 80), అజ్మతుల్లా ఒమర్జీ(69 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సతో 62) హాఫ్ సెంచరీలతో రాణిం చారు. జస్ప్రీత్ బుమ్రా(4/34) అఫ్గాన్ పతనాన్ని శాసించారు. హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు పడగొట్టాడు. శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్‌కు తలో వికెట్ దక్కింది.

## నవీన్ ఉల్ హక్‌పై చుక్కలు చూపించిన ఫ్యాన్స్.. ఏం చేశారంటే?

న్యూఢిల్లీ: అఫ్గానిస్థాన్ యువ పేసర్ నవీన్ ఉల్ హక్‌కు మరోసారి కోహ్లీ సెగ తగిలింది. వన్డే ప్రపంచకప్లో భాగంగా భారత్తో జరుగుతున్న మ్యాచ్లో బ్యాటింగ్‌కు వచ్చిన ఈ అఫ్గాన్ యువ పేసర్కు కోహ్లీ అభిమానులు చుక్కలు చూపించారు. క్రీజులోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఇన్నింగ్స్ ముగిసి మైదానం వీడే వరకు కోహ్లీ నామస్మరణంతో స్టేడియం దద్దరిల్లేలా చేశారు. కామెంటేటర్లు సైతం నవీన్ ఉల్ హక్‌పై సెటైర్లు పేల్చారు. అప్పటి వరకు ప్రశాంతంగా ఆటను చూస్తున్న అభిమానులు.. ఒక్కసారిగా కోహ్లీ కోహ్లీ అంటూ పెద్దగా అరవడం మొదలు పెట్టడంతో కామెంటేటర్లతో పాటు అంపైర్లు, ఆటగాళ్లు అవాక్కయ్యారు. ఎందుకలా అరుస్తున్నారని చూస్తే.. క్రీజులోకి నవీన్ ఉల్ హక్ రావడం గమనించారు. రవి శాస్త్రి అయితే తనదైన శైలిలో సెటైర్లు పేల్చుతూ నవ్వులు పూయించాడు. 'నవీన్ ఉల్ హక్ బ్యాటింగ్కు దిగడంతో స్టేడియం మొత్తం కోహ్లీ నామస్మరణంతో దద్దరిల్లుతోంది. ఎందుకో ఈ అద్భుతం? చెప్పినవారికి ఎలాంటి ప్రైజ్ లేదు.'అని రవిశాస్త్రి చమత్కరించాడు. ఐపీఎల్ 2023 సందర్భంగా విరాట్ కోహ్లీ-నవీన్ ఉల్ హక్ మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. లక్నో వేదికగా ఆర్సీబీ, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య రెండో మ్యాచ్లో జరిగిన ఈ గొడవ భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన ఘటనగా నిలిచిపోయింది. కోహ్లీ- నవీన్ ఉల్ హక్ గొడవ కాస్త మ్యాచ్ అనంతరం గంభీర్-కోహ్లీగా మారింది. ఒకరిపై ఒకరు దూసుకెళ్లేవరకు వెళ్లింది. కోహ్లీ పదే పదే ప్పి పరుగెడుతున్నాడని నవీన్ ఉల్ హక్ అంపైర్లకు ఫిర్యాదు చేయడం గొడవకు కారణమైంది. తాను ప్పికి వెళ్లలేదని, కావాలంటే తన షూస్ను చూడవచ్చని, ఎలాంటి మట్టి లేదని కోహ్లీ కాలిని పైకెత్తాడు. ఈ క్రమంలోనే నవీన్ ఉల్ హక్కు కోహ్లీ మందలించాడు. దాంతో అందరూ కోహ్లీని అపార్థం చేసుకున్నారు. నవీన్ ఉల్ హక్కు కోహ్లీ కాలు చూపించాడని భావించారు. గంభీర్ కూడా ఇలానే పొరపడి కోహ్లీతో వాగ్వాదానికి దిగాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం షేక్ హ్యాండ్ ఇచ్చుకునే క్రమంలో కోహ్లీ ఏదో సూచనలు చేయబోగా.. నవీన్ ఉల్ హక్ ఘాటుగా రియాక్ట్ అయ్యాడు.




మనం సినిమా
manamcinema

## నా సోదరిని ఆమె పిల్లల ముందే దారుణంగా చంపేశారు

ఇజ్రాయెల్-హమాస్ల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో అమాయక ప్రజలు చనిపోతున్న ఘటనలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. తాజాగా ఈ దాడిలో తన సోదరి, ఆమె భర్తను దారుణంగా చంపేశారంటూ బుల్లితెర నటి మధురా నాయక్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు వీడియో విడుదల చేయగా అది వైరల్గా మారింది. ''ఇప్పటి వరకు జరిగిన ఉగ్రదాడిలో చాలా మంది బంధువులను కోల్పోయాను. వారందరి ప్రేమ, ఆప్యాయతలు ఎప్పటికీ గుర్తుంటాయి. అక్టోబర్7న జరిగిన దాడిలో నా సోదరిని, ఆమె భర్తను వారి పిల్లల ముందే దారుణంగా చంపేశారు. ఇజ్రాయెల్లో ఉన్న బాధితులందరి కోసం మేం ప్రార్థిస్తున్నాం. ఉగ్రవాదుల అరాచకాలు ఎంత దారుణంగా ఉంటాయో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. పట్టపగలే మహిళలను, పిల్లలను, వృద్ధులను చంపేస్తున్నారు. ఈ కష్టకాలంలో ఇజ్రాయెల్ ప్రజలకు అండగా నిలవండి. బాధిత కుటుంబాల కోసం దయచేసి అందరూ ప్రార్థించండి'' అంటూ ఎమోషనల్ వీడియో పోస్ట్ చేశారు. అలాగే మరో పోస్టులో ప్రాణాలు కోల్పోయిన తన సోదరి కుటుంబసభ్యుల ఫొటోలను కూడా ఆమె పంచుకున్నారు. ఇక మధురా నాయక్ బాలీవుడ్‌లోని నాగిని సీరియల్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. మరోవైపు హైఫా ఫిల్మ్ ఫెస్టివల్లో పాల్గొనేందుకు ఇజ్రాయెల్ వెళ్లి అక్కడ చిక్కుకున్న బాలీవుడ్ నటి నుస్రత్ భరూచా సురక్షితంగా భారత్‌కు తిరిగొచ్చారు. అక్కడ ఆమెకు ఎదురైన భయానక అనుభవాన్ని ఆమె ఇన్‌స్టాలో పంచుకున్నారు.

## అరవింద సమేత మ్యూజిక్‌పై థమన్ ఇంట్రెస్టింగ్ పోస్ట్!



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో, యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ అరవింద సమేత వీర రాఘవ. ఈ చిత్రం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఒక ఆసక్తికరమైన పోస్టను షేర్ చేశారు. ఈ చిత్రానికి పాటలు, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కేవలం 4 నెలల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ జర్నీ తనకు లైఫ్ లాంగ్ గుర్తు ఉంటుంది అంటూ చెప్పుకొచ్చారు. థమన్ చేసిన ఈ పోస్ట్ వైరల్‌గా మారుతోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్‌ను వేరే లెవెల్‌లో ప్రెజెంట్ చేశారు డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ చిత్రంలోని పూజా హెగ్డే హీరోయిన్‌గా ఈ చిత్రంలో నటించగా, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు.

## విమానంలో వేధింపులు ఎదుర్కొన్న నటి..

### పోలీసులకు ఫిర్యాదు..!



మలయాళీ చిత్ర పరిశ్రమకు చెందిన నటి దివ్య ప్రభా వేధింపులకు గురయ్యారు. విమానంలో తోటి ప్రయాణికుడు తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఆమె ఆరోపణలు చేశారు. ఈ విషయంపై కేరళ పోలీసులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ''అక్టోబర్ 10వ తేదీన సాయం త్రం ఎయిర్ ఇండియా విమానంలో ముంబయి నుంచి కొచ్చికి ప్రయాణం చేశా. నా పక్క సీటులో ఉన్న ప్రయా ణికుడి వల్ల నేను ఇబ్బందులు ఎదుర్కొ న్నా. మద్యం తాగిన అతడు టేకాఫ్కు ముందే నాతో వాగ్వాదానికి దిగాడు. ఇబ్బందికరంగా తడుముతూ అసభ్యక రంగా ప్రవర్తించాడు. విమాన సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో వాళ్లు నా సీటును మార్చారు. వేధింపులకు పాల్పడిన అత డిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాం తో నేను కొచ్చిలో దిగిన వెంటనే ఎయిర్ పోర్ట్‌లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశా. పోలీసులకు ఫిర్యాదు చేయమని వారు నాతో చెప్పారు'' అంటూ ఆమె తెలిపారు. కేరళ పోలీసులను ట్యాగ్ చేసిన ఆమె, మెయిల్ ద్వారా వారికి ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ఎయిర్ఇండియా అధికారులు, విమానంలోని సిబ్బంది స్పం దించిన తీరు తనకు ఏమాత్రం సంతృప్తిని ఇవ్వలేదన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. E-mail Id: editor@manamnews.com.